


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 430 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 25 జూన్ 2025 | వెల : 4/-


## కేసీఆర్ కుట్రలతోనే తెలంగాణ ప్రాజెక్ట్‌లు

# ఆగిపోయాయి



- సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- రాష్ట్రం దివాలా తీస్తే.. ఆ ముగ్గురూ సంపన్నులెలా అయ్యారు
- రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశాం
- వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారు
- రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యా
- రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తాం

హైదరాబాద్

హైదరాబాద్: రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం ఇవాళ్టితో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేల కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గోదావరి జలాలపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చ పెడతాం.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రాజెక్ట్‌ల పేరు, ఊరు మార్చి కేసీఆర్ లక్ష కోట్లు కొల్లగొట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు సీమాంధ్ర పాలకులు తెలంగాణను ఏడారిగా మార్చారని కేసీఆర్ అన్నారని చెప్పారు. తాను చంద్రబాబుతో ఉండాలనుకుంటే టీడీపీలోనే ఉండేవాడినని.. తెలంగాణ కోసమే రాహుల్‌గాంధీ ఆశీస్సులతోనే కాంగ్రెస్‌లోకి వచ్చానని ఉద్ఘాటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన 18 నెలల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఇవాళ(మంగళవారం) సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ చెప్పాకే బనకచర్లపై ఏపీ ముందుకు వెళుతోందని స్పష్టం చేశారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్ట్‌లు ఆగిపోవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్ కుట్రలతోనే తెలంగాణ ప్రాజెక్ట్‌లు ఆగిపోయాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌లు కొట్టుకుపోవడానికి కారణం కేసీఆర్ కాదా అని నిలదీశారు. రైతుల ఆశీర్వాదంతోనే తాను చిన్న వయస్సులో సీఎం అయ్యానని ఉద్ఘాటించారు. భూమి కేంద్రంగానే సాగిన జీవితం.. తెలంగాణ - మిగతా3లో



## బూతులతో నెట్టు కొస్తానంటే

# కుదరదు రేవంత్ రెడ్డి

- తెలంగాణకు శనిలా, శాపంలా మారిన రేవంత్ రెడ్డి
- పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించిన అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారు.
- పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిగా మారితే ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం దేశం నెంబర్ వన్ ఎలా అవుతుంది రేవంత్ రెడ్డి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్

ప్రభుత్వ కార్యక్రమని మరిచి.. తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అడ్డగోలు వ్యాఖ్యలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి తన చిల్లర బుద్ధిని ప్రదర్శించాడని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణకు శనిలా, శాపంలా మారిన రేవంత్ రెడ్డి 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే రీతిలో పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించిన అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని - మిగతా3లో

## పార్టీలో క్రమశిక్షణ దాటితే


# వేటు తప్పదు

- నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్
- మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా నేతలు అందరూ కలిసి పని చేయాలి
- పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్లో పని చేయాల్సిందే
- పని చేస్తేనే పదవులు వస్తాయి
- రాబోయే రోజుల్లో సవాళ్లు ఎదుర్కోబోతున్నాం
- త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలి
- "మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి
- బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి
- పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే.



హైదరాబాద్

రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు. "మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ - మిగతా3లో



## ఆర్జేడీ జాతీయ అధ్యక్షుడిగా లాలూ ప్రసాద్ యాదవ్

ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో లాలూ ప్రసాద్ పునఃనియామకం

## 'ఇక బీజేపీలో చేరికా?' కుండబద్దలు కొట్టేసిన శశిథరూర్

"ప్రధాని మోదీ చొరవతో.. ఇతర దేశాలతో భారత్ సంబంధాలు మెరుగుపడ్డాయి.



## రైల్వే టికెట్ ఛార్జీల పెంపు.. జులై 1 నుంచి అమల్లోకి!

రైల్వే వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్లమీడియా వెబ్‌సైట్లలో వార్తలు



# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు

- కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు
- కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారు
- రూ.2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశాం



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డిలా వ్యవసాయంపై ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని అన్నారు. కొంతమంది బీఆర్ ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పు లు పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రూ.2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశామని గుర్తుచేశారు. తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ కూడా కేంద్రంలో రూ. 4లక్షలు రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వరకు కూడా రైతుబంధు వేయలేదని.. కానీ ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని ఉద్ఘాటించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. - మిగతా3లో

# ‘ఇక బీజేపీలో చేరికా?’ కుండబద్ధలు కొట్టేసిన శశిథరూర్



జపీయూష్ గోయల్‌తో సెల్ఫీ దిగడం, ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఆకాశానికి ఎత్తడం, భారత ప్రధాని నరేంద్ర మోదీని పొగడడం, అదే తరుణంలో కాంగ్రెస్‌తో విభేదాలున్నాయని అంగీకరించడం.. ఇవన్నీ వేటికి సంకేతాలుగా భావించొచ్చు!. ఇదే విషయాన్ని తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ వద్ద ప్రస్తావించగా.. ఆయన చిరునవ్వుతో అదేం లేదంటున్నారు. తాజాగా .. సోమవారం(జూన్ 23న) %ఖ్త్రవ ఎఱఅఅబ% పత్రికలో శశిథరూర్ రాసిన ఓ వ్యాసం పబ్లిష్ అయ్యింది. ఆపరేషన్ సిందూర్.. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విదేశాంగ ప్రచారం భారతదేశ ఐక్యతను, సంకల్పాన్ని సూచించిందని ఆ కథనంలో థరూర్ రాశారు. ఈ వ్యాసాన్ని ప్రధానమంత్రి కార్యాలయం కూడా షేర్ చేయగా.. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందిస్తూ “శశిథరూర్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని లోపాలను.. ఆ పార్టీలోని విభేదాలను బహిర్గతం చేశాయి” అని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిణామాలన్నీ బీజేపీలో చేరికకు సంకేతాలుగా భావించొచ్చా? అని మంగళవారం ఎదురైన ప్రశ్నకు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. ఇవేవీ నేను బీజేపీలో చేరతానన్న సంకేతం కాదని స్పష్టత ఇచ్చారాయన. “విదేశాంగ మిషన్ విజయాన్ని మాత్రమే నేను ఆ వ్యాసంలో ప్రస్తావించా. ఇది అన్ని పార్టీల ఐక్యతను ప్రతిబింబించే విషయం మాత్రమే” అని అన్నారాయన. “ప్రధాని మోదీ చొరవతో.. ఇతర దేశాలతో భారత్ సంబంధాలు మెరుగుపడ్డాయి. అయితే ఇది బీజేపీనో, కాంగ్రెస్ తీసుకొచ్చిన విదేశాంగ విధానం కాదు. ఇది భారతదేశ విదేశాంగ విధానం. సుమారు 11 ఏళ్ల కిందట పార్లమెంట్‌లో విదేశాంగ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇదే విషయం చెప్పాను. అంత మాత్రాన నేను ప్రధాని మోదీ పార్టీలో చేరతానని కాదు. ఇది జాతీయ సమైక్యతకు సంబంధించిన ప్రకటన మాత్రమే” అని కుండబద్ధలు కొట్టారాయన. అంతకుముందు.. కాంగ్రెస్ అధిష్టానంతో తనకు కొన్ని విషయాల్లో విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి నాలుగు గోడల మధ్య చర్చించుకుంటే పరిష్కారం అయ్యే విషయాలేనని, వాటి గురించి సమయం వచ్చినప్పుడు చెబుతానని థరూర్ మీడియా ముఖంగా ప్రకటన చేశారు.“ గత నాలుగేళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు నా విజయంలో కీలక పాత్ర పోషించారు. నేను ఇప్పటికీ కాంగ్రెస్‌కు విదేయుడినే. పార్టీకి అవసరమైతే పెద్ద పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాను. ఇతర పార్టీలో చేరే ఆలోచన ఏమాత్రం లేదు” అని ఆ సమయంలో అన్నారయన. అలాగే, తాను ప్రజాస్వామ్యవాదిగా, మతతత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయాన్ని నమ్మే వ్యక్తినంటూ గతంలోనూ ఆయన చాలాసార్లు చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబడుతోంది. అయితే ఆ పార్టీ సీనియర్ సభ్యులు థరూర్ మాత్రం అందుకు భిన్నంగా ఆకాశానికి ఎత్తుతున్నారు. అలాగే.. ట్రంప్ మధ్యవర్తిత్వం ప్రకటన విషయంలో కాంగ్రెస్ లైన్‌కు భిన్నంగా థరూర్ వ్యవహరించడమూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే థరూర్ తాజా వ్యాఖ్యలతో ఆయన బీజేపీలో చేరతారన్న ఊహాగానాలకు తాత్కాలికంగా తెరపడినట్లయ్యింది.

# భారత్ భూభాగాలను తప్పు చూపించిన కాంగ్రెస్




**న్యూఢిల్లీ :** ఇటీవల సోషల్ మీడియాలో, ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్ వీడియోల ద్వారా, భారత రాజకీయ పార్టీలపై భౌగోళిక తప్పిదాలకు సంబంధించిన ఆరోపణలు వైరల్ అవుతున్నాయి. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ భారతదేశ భౌగోళిక సరిహద్దులను తప్పుగా చూపించిందనే విమర్శలను లేవనెత్తుతుంది.సోషల్ మీడియా పోస్టుల ప్రకారం, కాంగ్రెస్ పార్టీ బెలగావి, తెలంగాణలో నిర్వహించిన కార్యక్రమాలలో భారతదేశ భౌగోళిక మ్యాప్‌ను తప్పుగా చిత్రీకరించిందని ఆరోపణలు వచ్చాయి. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ , అక్సాయ్ చిన్ లాంటి ప్రాంతాలను పాకిస్తాన్ లేదా చైనా భాగంగా చూపించినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలు రాజకీయ ప్రత్యర్థులు, సోషల్ మీడియా వినియోగదారులచే విస్తృతంగా ప్రచారం చేయబడ్డాయి. అయితే, ఈ ఆరోపణలు పూర్తిగా వాస్తవమా లేక రాజకీయ కోణంలో వక్రీకరించబడినవా అనేది తెలియాల్సిన అవసరం ఉంది.భారతదేశ భౌగోళిక సరిహద్దులు రాజకీయంగా సున్నితమైన అంశం. ఈ సమస్యను రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థులపై దాడి చేయడానికి ఉపయోగించడం కొత్తేమీ కాదు. కాంగ్రెస్‌పై వచ్చిన ఈ ఆరోపణలు ఆ పార్టీ జాతీయవాద ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నంగా కనిపిస్తాయి. అటువంటి విమర్శలు సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతాయి, ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో, ఇవి యువతను త్వరగా ఆకర్షిస్తాయి. ఈ ఆరోపణలు కాంగ్రెస్‌కు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే అవకాశాన్ని కల్పిస్తాయి, ముఖ్యంగా జాతీయ భద్రత, సమగ్రత వంటి .సోషల్ మీడియా, ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్, రాజకీయ సందేశాలను వేగంగా వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ వీడియోలు తరచుగా సంక్షిప్తంగా, ఆకర్షణీయంగా ఉంటాయి, కానీ వాటిలోని సమాచారం ఎంతవరకు వాస్తవమో పరిశీలించడం కష్టం. ఎక్స్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో చర్చలు ఈ ఆరోపణలను మరింత ఊతం ఇస్తున్నాయి, కానీ అవి తరచుగా ధృవీకరించని సమాచారంపై ఆధారపడతాయి. ఇటువంటి వివాదాలు రాజకీయ ధ్రువీకరణను పెంచుతాయి. ప్రజలలో తప్పుడు అవగాహనలను సృష్టించే అవకాశం ఉంది.ఈ ఆరోపణలు ఎంతవరకు నిజమో తెలుసుకోవడానికి, కాంగ్రెస్ ఉపయోగించిన మ్యాప్‌ల యొక్క అధికారిక ఆధారాలు, సందర్భాన్ని పరిశీలించాలి. ఒకవేళ తప్పు జరిగి ఉంటే, అది ఉద్దేశపూర్వకమా లేక పొరపాటా అనేది స్పష్టం కావాలి. ఒక ప్రముఖ రాజకీయ పార్టీ భౌగోళిక సరిహద్దుల విషయంలో తప్పు చేసిందనే ఆరోపణ గంభీరమైనది, కానీ దానిని రాజకీయ లాభం కోసం ఉపయోగించడం కూడా సాధారణం. వాస్తవాలు లేకుండా విమర్శలు చేయడం లేదా రక్షణ చేయడం రెండూ సమస్యాత్మకం.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు.. కొనసాగుతున్న యుద్ధం?



**జెరూసలేం:** పశ్చిమాశియాలో యుద్ధం పున:ప్రారంభమైనట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ తూట్లు పొడిచింది. ఇజ్రాయెల్‌పై దాడులకు తెగబడింది. దీంతో ఇజ్రాయెల్ కాల్పుల్ని తిప్పికొట్టింది. ఇరాన్‌పై ప్రతిదాడులకు దిగింది. దీంతో గంటల వ్యవధిలో ఇరు దేశాల మధ్య యుద్ధం పున:ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌కు ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ దాడులకు దిగిందని హెచ్చరించింది. దాడులు ఇలాగే కొనసాగితే కోలుకోలేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, ఇజ్రాయెల్ వార్నింగ్ ఇరాన్ స్పందించింది. ఇరు దేశాల మధ్య జరిగిన కాల్పుల విమరణ ఒప్పందం జరిగిన తరువాత తాము ఎలాంటి కాల్పులు జరపలేదని . అయినప్పటికీ ఇరుదేశాల మధ్య కాల్పుల మోత మోగుతూనే ఉంది. 12 రోజులుగా కొనసాగుతున్న ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగింపు పలికారు. ఇరు దేశాలు తన మధ్యవర్తిత్వం వల్ల యుద్ధం ఆగిపోయింది.ఇజ్రాయెల్, ఇరాన్‌లు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయని తన ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. దీంతో పశ్చిమాశియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగిసినట్లే అని అందరూ అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఇరాన్ ఇజ్రాయెల్‌పై భీకరదాడి చేసింది. ఇజ్రాయెల్ సైతం అదే తరహాలో ఇరాన్ దాడుల్ని ప్రతిఘటించింది. ఇరాన్ దాడుల్ని ్రాయెల్ భూభాగంలోకి క్షిపణులను ప్రయోగించిన తర్వాత ఇరాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్)మంగళవారం ఆరోపించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యంతో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పూర్తి కాల్పుల విరమణ అని ప్రకటించిన కొన్ని గంటల తర్వాత ఈ దాడులు జరిగాయి.

## ఆర్జేడీ జాతీయ అధ్యక్షుడిగా లాలూ ప్రసాద్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి వరుసగా 13వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ విషయాన్ని పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో లాలూ ప్రసాద్ పునఃనియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. లాలూ ప్రసాద్ యాదవ్ బుధవారం తన 78వ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్న విషయం తెలిసిందే. పాట్నాలోని నివాసంలో 78 కిలోల భారీ లడ్డూ కేక్‌ను పొడవైన కత్తితో కట్ చేశారు. ఆయన అనుచరులు, పార్టీ నేతలు ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ‘లాలూ యాదవ్ జిందాబాద్’ అని నినాదాలు చేశారు. ఈ వయసులో ఆయన మరోసారి పార్టీ పగ్గాలు చేపట్టడం విశేషం.

## రైల్వే టికెట్ ఛార్జీల పెంపు.. జులై 1 నుంచి అమల్లోకి!



**ఇంటర్నెట్ డెస్క్:** ట్రైన్ టికెట్ ధరలు స్వల్పంగా పెరగనున్నాయి. జులై 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. నాన్ ఏసీ మెయిల్/ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధర కిలోమీటర్‌కు 1 పైసా, ఏసీ తరగతి టికెట్ ధర కిలోమీటరుకు 2 పైసలు చొప్పున పెరగనున్నాయి. రైల్వే వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్లమీడియా వెబ్‌సైట్లలో వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. చాలా ఏళ్ల తర్వాత రైల్వే టికెట్ ధరలు సవరిస్తుండడం గమనార్హం. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకు సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఈ పెంపు వర్తించదు. 500 కిలోమీటర్లు దాటితే కిలోమీటరుకు ఒక పైసా చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ టికెట్‌కు సంబంధించి రైల్వే శాఖ ఇటీవలే కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆధార్ అథంటికేషన్ ఉన్న వారికి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. జులై 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. అదే రోజు నుంచి టికెట్ ధరల పెంపు కూడా అమల్లోకి రానున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. నెలవారీ సీజన్ టికెట్ ధరల్లోనూ ఎలాంటి మార్పూ ఉండబోదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ట్రంప్ సహనం కోల్పోయిన వేళ.. అంత మాట అనేశారేంటి?



**వాషింగ్టన్:** ఇజ్రాయెల్-ఇరాన్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ అంత ఎత్తున లేచారు. తన మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణ అని ఇరు దేశాలు ప్రకటించిన కాసేపటికే మళ్లీ క్షిపణులతో యుద్ధానికి దిగడంపై ట్రంప్ తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. ‘నాకు చెప్పిందేమిటి?.. మీరు చేస్తున్నదేంటి? అని ట్రంప్ మండిపడ్డారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడిన ట్రంప్.. సహనాన్ని కోల్పోయి అభ్యంతరకర పదజాలాన్ని కూడా వాడారు. ఇక వారి ఇష్టం.. వారికిష్టమొచ్చింది చేస్కుంటారు అంటూ ట్రంప్ మీడియా సాక్షిగా అసహనం ప్రదర్శంచారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ః మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఆటు తర్వాత ఇరు దేశాల కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చినట్లు తెలిపారు. ఇక ఒకరిపై ఒకరు కత్తులు దూసుకోరంటూ ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు తిరిగి సొంత గడ్డపైకి వచ్చేస్తాయని, అదే సమయంలో ఇరాన్ కూడా ఒక మెట్టు దిగిందన్నారు. ఇక తక్షణమే ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ట్రంప్ తెలిపారు.

## అవన్నీ ఊహాగానాలే.. ఎయిరిండియా ‘బ్లాక్ బాక్స్’ అంశంపై రామ్మోహన్ నాయుడు క్లారిటీ

**పుణె:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తును అధికారులు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఈ విమానంలో అసలేం జరిగిందో తెలుసుకోనేందుకు అందరి దృష్టి ఇప్పుడు ‘బ్లాక్ బాక్స్’ విశ్లేషణపై పడింది. ఈ నేపథ్యంలో బ్లాక్‌బాక్స్‌ను విచారణ కోసం విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. ఫిక్కీ, కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పుణెలో జరిగిన హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్‌క్రాఫ్ట్స్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపిస్తున్నారా? అని విలేకర్లు అడగ్గా.. “అవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్‌బాక్స్ భారత్‌లోనే ఉంది. దీన్ని ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పరిశీలిస్తోంది” అని స్పష్టం చేశారు. ఎప్పటివరకు దీంట్లోని డేటాను పొందొచ్చని మరో ప్రశ్నకు స్పందిస్తూ.. ‘ఇది చాలా సాంకేతికతతో కూడిన వ్యవహారం. ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం ప్రక్రియను పరిశీలించనివ్వండి” అన్నారు. జూన్ 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటికే ఓ వైద్య కళాశాల వసతిగృహంపై కూలడం పెను విషాదం నింపింది. ఈ ఘటనలో 240 మంది ప్రయాణికులతో పాటు 270మంది ప్రాణాలు కోల్పోగా.. విమాన ప్రయాణికుల్లో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు.

# పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదు

-మొదటిపేజీ తరువాయి

నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలి. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జ్ మంత్రుల పనితీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా జిల్లాల్లో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగించినా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం సీట్లు గెలిచేలా ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు నిధులు ఇచ్చామని, వాటిని సరిగ్గా ఎందుకు ఆయా జిల్లాల్లో ఉపయోగించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

**పని చేయకపోతే డిమోషన్..**

అలాగే.. మంత్రి పదవుల కోసం కొంతమంది కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేయించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు. పదవులు వచ్చినవారు తెలంగాణ రాష్ట్రమంతా తిరగాలని ఆదేశించారు. పదవులు అడగటం తప్పు లేదు.. కానీ నిరసన హుందాగా ఉండాలని సూచించారు. పీసీసీ కార్యవర్గంలో ఉన్న వారిని రెండుగా చేసి జాబితా సిద్ధం చేయాలని.. ముందు అందరికీ పని అప్పగించాలని ఆదేశించారు. పని చేసిన వాళ్లది ఒక జాబితా, పనిచేయని వాళ్లది మరో జాబితా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. ఇవాళ(మంగళవారం) గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పని చేయకపోతే డిమోషన్.. పని చేస్తే ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. పని చేయకపోతే పక్కన పెట్టడంలో మొహమాటం అవసరం లేదని తేల్చిచెప్పారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

**పదేళ్లు అధికారం మనదే...**

గతంలో తాను టీపీసీసీ చీఫ్ అయిన తర్వాత ఫ్రంటల్



ఆర్గనైజేషన్ చైర్మన్ బాధ్యతలు తీసుకోమంటే కొందరు నేతలు తీసుకోలేదని గుర్తుచేశారు. తాము సీనియర్లం, ఆ చిన్న బాధ్యత తీసుకోమని తనకు ఆ నేతలు చెప్పారని అన్నారు. ఆ రోజు బాధ్యత తీసుకున్ననాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ పదవులు ఇచ్చామని స్పష్టం చేశారు. పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం అయితే పదవులు వాటంతట అవే వస్తాయని ఉద్ఘాటించారు. ఇంకో నాలుగు సంవత్సరాలు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అన్నారు. త్వరలోనే మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 2029 ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. పార్టీలో పనిచేయని వారిని పదవుల నుంచి తొలగించాలని ఆదేశించారు. తెలంగాణలో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి రావాలంటే.. పార్టీ నేతల పనితీరుపైనే ఆధారపడి ఉందని తేల్చిచెప్పారు. పదేళ్లు అధికారం మనదేనని స్పష్టం చేశారు. పార్టీ పదవిని చిన్నచూపు చూస్తే వారికే నష్టమని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం జోడేదుల్లాలాగా పనిచేయాలని సూచించారు. 18 నెలల ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని అభివర్ణించారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లగలుగుతామని ఉద్ఘాటించారు. పార్టీ నిర్మాణంపైన టీపీసీసీ దృష్టి సారించాలని అన్నారు. పార్టీ నాయకులంతా ఐక్యంగా పని చేయాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**నేతలు కలిసి పని చేయాలి..**

మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా నేతలు అందరూ కలిసి పని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్లో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పని చేస్తేనే పదవులు వస్తాయని చెప్పారు. పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చామని ఉద్ఘాటించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీలు, టెంపుల్ కమిటీల వంటి నామినేటేడ్ పోస్టులు భర్తీ చేసుకోవాలని ఆదేశించారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు. మన ప్రభుత్వ%శీ% చాలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఉద్ఘాటించారు. అనేక సామాజిక అంశాలను కూడా ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో చాలా సవాళ్లు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికలు లాంటి అంశాలు మన ముందుకు రాబోతున్నాయని వెల్లడించారు. తాను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఇది గోల్డెన్ పీరియడ్:మల్లు భట్టి విక్రమార్క**

కాంగ్రెస్ పార్టీ నిర్మాణం గురించి బూత్ స్థాయి నుంచి బలోపేతంపై చర్చించామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాదిన్నర కాలంగా నడుస్తోన్న ప్రభుత్వాన్ని గోల్డెన్ పీరియడ్‌గా భట్టి విక్రమార్క అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని గోల్డెన్ పీరియడ్‌గా జనంలోకి తీసుకెళ్లాలని పీఏసీలో నిర్ణయించామని అన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం, రైతులకు బోనస్ వంటి వాటిపై ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కింద ప్రతి నియోజకవర్గంలో 4500 ఇండ్లు ఇస్తున్నామని ప్రకటించారు. 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందజేస్తున్నామని వెల్లడించారు. ఏడాదిన్నరలో రూ.95,351 కోట్లు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# కేసీఆర్ కుట్రలతోనే తెలంగాణ ప్రాజెక్టులు ఆగిపోయాయి

-మొదటిపేజీ తరువాయి

రైతాంగ జీవితమని అభివర్ణించారు. భూమి చుట్టూనే తెలంగాణలో పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుంచి.. వ్యవసాయం పండగ అనే పరిస్థితి తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. రైతులకు ఉచిత విద్యుత్ అందించింది కాంగ్రెస్ పార్టీనే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత రైతులేనని తేల్చిచెప్పారు. కేసీఆర్ ఎగవేసిన రైతు భరోసా నిధులను తాము ఇచ్చామని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.20,600 కోట్లతో రైతు రుణమాఫీ చేశామని తెలిపారు. రైతుబంధు ఇచ్చేందుకు నాడు భూములు అమ్మారని ఆరోపించారు. రుణమాఫీ కోసం అవుటర్ రింగ్ రోడ్డును కూడా అమ్మేశారని మండిపడ్డారు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం పోరాటాలు జరిగేవని అన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్లు వాయిదా వేయాలని అభ్యర్థులు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

**వ్యవసాయాన్ని పండగ చేశాం..**


'రైతు భరోసాని తొమ్మిదిరోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. 1600రైతు వేదికల వద్ద 71లక్షల మంది రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. వ్యవసాయం దండగ అనే పరిస్థితుల నుంచి పండగ చేశాం. మా మొదటి ప్రాధాన్యం రైతులు, మహిళలు, తెలంగాణ ఉద్యమ కారులు, విద్యార్థులు. ఎన్నికలప్పుడు 2లక్షల్లోపు రైతు రుణమాఫీ చేస్తాం అని చెప్పాం. చెప్పినట్లే 25లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేశాం. కేసీఆర్ వరి వేస్తే ఉరి అని చెప్పారని... మేం వరి కొనుగోలు చేస్తాం అని చెప్పాం. పండించి ప్రతి గింజను కొనుగోలు చేశాం. సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేశాం. కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేన్సర్ బారిన పడేశారు. శకుని మామకు శనీశ్వర అల్లుడు దొరికిండు. రూ.8లక్షల కోట్ల అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని మాకు ఇచ్చారు. భూములు అమ్ముకుని జేబులు నింపుకున్నారు. హరీష్‌రావుకు మొయినాబాద్‌లో, కేటీఆర్‌కు జన్వాడలో, కేసీఆర్‌కు గజ్వేల్‌లో ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది. కేసీఆర్ కుటుంబ సభ్యులు శ్రీమంతులు ఎలా అయ్యారు. రాష్ట్రం ఎందుకు దివాళా తీసింది. నేను వచ్చాక 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తా. కేసీఆర్ పదేళ్లలో మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పండి. మేం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా కేసీఆర్. కాళేశ్వరం పేరిట మీరు లక్ష కోట్లు దోచుకున్నారు. మేం రైతుల కోసం లక్ష 40వేల కోట్లు ఖర్చు చేశాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

**కేసీఆర్‌వీ కుట్రలు, కుతంత్రాలు..**

'కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలతో కృష్ణా నదిపై మొదలు పెట్టిన ఏ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గోదావరిలో కొట్టుకుపోవడానికి కేసీఆర్ అవినీతి కారణం కాదా. నిన్ను ఉరి తీసినా తప్పులేదని అక్కడి రైతులు అంటున్న మాట వాస్తవం కాదా. లక్ష కోట్లు కొల్లగొట్టి వేల కోట్లు చేరబట్టారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చ పెడదాం వస్తావా. తేదీ చెప్పండి అదే రోజు అసెంబ్లీ పెడదాం. నువ్వు ఇచ్చిన సలహాతోనే కదా బనకచర్ల దరిద్రం దాపురించింది. రాయలసీమను రతనాల సీమ చేస్తా అన్న సన్నాసి నువ్వు కాదా కేసీఆర్. నీ అల్లుడితో మాట్లాడించడం కాదు.. నువ్వు చర్చకు రా. స్పీకర్‌కు లేఖ రాయి.. అసెంబ్లీలో చర్చిద్దాం. ఒక రోజు కృష్ణాపై, మరో రోజు గోదావరి నీళ్లపై చర్చిద్దాం. కృష్ణాలో 512 టీఎంసీల నీరు ఏపీకి రాసిచ్చింది, తెలంగాణకు 299 టీఎంసీలకు ఒప్పుకున్నది నువ్వు కాదా. ఏపీ పట్టిసీమ కట్టింది, రాయలసీమ ఎత్తిపోతలకు జీవో ఇచ్చింది నీ హయాంలో కాదా. తెలంగాణకు మరణ శాసనం రాసింది నువ్వు కాదా. నీకు మొహం చెల్లక ఫాంహౌస్‌లో పడుకున్నావ్. బీఆర్ఎస్ చచ్చిన పాము. అది ఇంకా అధికారంలోకి రాదు. మీరు ఏపీకి సహకరిస్తే సుప్రీంకోర్టుకు వెళ్తామని కేంద్ర ప్రభుత్వానికి చెప్పి వచ్చాం. రాబోయే రోజుల్లో రాజీవ్ యువ వికాసాన్ని ముందుకు తీసుకెళ్తాం. యువకులను ఆదుకుంటాం. 2033వరకు మేమే అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఆర్ఆర్ఆర్‌కు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ :** హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ) ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ సూపర్ గేమ్ ఛేంజర్‌గా ఈ ప్రాజెక్టును భావిస్తున్నారు. మె?త్తం 350 కి.మీ రహదారిని రెండు భాగాలుగా నిరిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం పనులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. టెండర్లు ఆహ్వానించారు. తాజాగా దక్షిణ భాగపై కీలక అప్డేట్ వచ్చింది. రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రోడ్లు, భవనాల విభాగం రూపొందించిన మూడు ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కిలోమీటర్ల పొడవైన ఎలైన్‌మెంట్‌కు తుది ఆమోదం లభించింది.మంత్రివర్గం ఆమోదించిన దక్షిణ భాగం ఎలైన్‌మెంట్ చౌటుప్పల్ ( ఉమ్మడి నల్గొండ జిల్లా) వద్ద ప్రారంభమై, వివిధ ప్రాంతాల గుండా ప్రయాణించి సంగారెడ్డి జిల్లాలో ముగుస్తుంది. ఈ మార్గం అనేక మండలాలను, గ్రామాలను కలుపుతూ వెళ్తుంది. ఇది భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో అభివృద్ధికి దోహదపడుతుంది. ఉత్తర భాగం ఎలైన్‌మెంట్‌కు ఇప్పటికే ఆమోదం లభించింది. ఇప్పుడు దక్షిణ భాగానికి కూడా గ్రీన్ సిగ్నల్ రావడంతో ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ మరింత వేగవంతం కానుంది. తదుపరి చర్యలుగా భూసేకరణ ప్రక్రియ, ఆఖఖీ తయారీ, నిధుల సమీకరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందడంతో పాటు, రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని నిపుణులు



అభిప్రాయ పడుతున్నారు.హైదరాబాద్ నగరం చుట్టూ రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి రీజనల్ రింగ్ రోడ్డు ఒక కీలక ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాలను కలుపుతూ, వివిధ జాతీయ రహదారులను అనుసంధానిస్తుంది. రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ గుండా వెళ్లకుండానే వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణించడం సాధ్యమవుతుంది. ఇది ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. నగరంలోకి వచ్చే భారీ వాహనాల సంఖ్య తగ్గుతుంది, తద్వారా నగరం లోపల ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. రింగ్ రోడ్డు వెంట కొత్త పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాల ఏర్పాటుకు అవకాశం లభిస్తుంది

## తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు

-మొదటిపేజీ తరువాయి

9 రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామంటే కొందరు నేతలు నమ్మలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు తెస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే రేవంత్ ప్రభుత్వం రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులను మరువబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇంకా చాలా పథకాలు తీసుకురాబోతుందని ఉద్ఘాటించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన తర్వాతనే తమకు ఓటు వేయమని అడుగుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

**రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు: భట్టి విక్రమార్క**

ఈరోజు దేశ చరిత్రలో లిఖించదగిన రోజని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడం దేశ చరిత్రలో ఇంతవరకు ఎక్కడ జరగలేదని చెప్పారు. 'వ్యవసాయం అంటే కాంగ్రెస్. వ్యవసాయం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్. రైతుల కోసం ఉచిత కరెంట్‌ని, గిట్టుబాటు ధరను తెచ్చిందే కాంగ్రెస్. హరిత విప్లవాన్ని తెచ్చిందే కాంగ్రెస్. ఏ రాజకీయ పార్టీ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించలేదు. రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు. అందరి ఖాతాల్లో రూ.9000 కోట్లు వేస్తామని చెప్పామని.. అలానే వేశాం' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు

## బూతులతో నెట్టు కొస్తానంటే కుదరదు రేవంత్ రెడ్డి




-మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. ఎన్నికల్లో అడ్డమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేక, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంటే ఎటూ పాలుపోక నిరాశ నిస్పృహలతో పాలనలో కూడా ప్రతి రోజూ అబద్ధాలు, బూతులతో నెట్టుకొస్తాని రేవంత్‌రెడ్డి అనుకుంటే కుదరదన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై భరోసా లేక విధి లేని పరిస్థితుల్లో రైతు భరోసా వేసి తానే రైతులకు ఛాంపియన్ అనే బిల్డప్ ఇస్తే ఎవరు నమ్ముతారు రేవంత్ రెడ్డి? అంటూ మండిపడ్డారు. దేశంలోనే మొదటిసారిగా రైతులకు పెట్టుబడి సాయం చేయాలని ఆలోచించి.. రైతుబంధు మొదలు పెట్టి రూ.80వేల కోట్ల అన్నదాతల అకౌంట్లలో వేసి వ్యవసాయాన్ని పండగలా చేసిన కేసీఆర్‌ను ఉరి తీయాలని ఉన్మాదిలా మాట్లాడుతావా ? తెలంగాణ నిన్ను క్షమించదు రేవంత్ రెడ్డి అన్నారు. రూ.లక్ష కోట్లే ఖర్చుకాని కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షకోట్ల అవినీతి జరిగిందంటే ప్రపంచం నవ్విపోతున్నదని.. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిగా మారితే ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం దేశం నెంబర్ వన్ ఎలా అవుతుంది రేవంత్ రెడ్డి ? అంటూ నిలదీశారు. అధికారంలోకి వచ్చినాక కనీసం ఒక చెక్ డ్యామ్ కట్టావా? ఓ కాలువ తవ్వావా? ధాన్యం ఉత్పత్తి పెరగటానికి రేవంత్ రెడ్డి ? పదేళ్ల కేసీఆర్ పాలనలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 2 లక్షల కోట్లు ఖర్చు పెట్టి 44 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తేనే కదా ధాన్యం ఉత్పత్తి.. రూ.3కోట్ల టన్నులను తాకింది రేవంత్ రెడ్డి ? కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులకు రూ.4వేలకోట్ల ఖర్చు పెట్టి ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చే పని చేశామన్నారు. ఇరిగేషన్‌శాఖలో ఈ వివరాలు ఉన్నాయని.. అధికారులను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉండి సీఎం స్థానంలో ఉండి, సభా నాయకుడిగా వ్యవహరిస్తున్న నీకు అసెంబ్లీ సమావేశాల ఏర్పాటుకు ప్రతిపక్షం డిమాండ్ చేయాల్సిన పని లేదని తెలియదా? అని మండిపడ్డారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని.. నీ ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపించి తెలంగాణకు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. కృష్ణా నదిపై సమైక్య పాలకులు 299 టీఎంసీల మేరకే ప్రాజెక్టులు ప్రతిపాదించినందుకే కదా? ఆ మొత్తంలో నీటిని వాడుకునేందుకు తాత్కాలిక ఒప్పందం కుదిరిందని ఎన్నిసార్లు వాస్తవాలు చెబుతున్నా.. పని గట్టుకుని బురద జల్లే నీ మూర?త్వాన్ని అర్థం చేసుకోనంత అమాయకులు తెలంగాణ ప్రజలు కాదన్నారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయని దద్దమ్మవి నువ్వు.. ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలిందని అంటున్నావని.. అది నోరా.. మోరా ? అంటూ తీవ్రంగా స్పందించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలపై, ఉద్యోగ నియామకాలపై అదే పనిగా అబద్ధాలు చెబితే అవి నిజాలై పోతాయా? అని నిలదీశారు. దమ్ముంటే చిత్తశుద్ధి ఉంటే ఇసుమంతైనా నిజాయితీ ఉంటే రూ.30 లక్షలు మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇచ్చి మాట్లాడు మాట్లాడాలని సవాల్ విసిరారు. సన్న వడ్లకు బోనస్‌ను రైతుల అకౌంట్లలో వేశానని బోగస్ మాటలు చెప్పొద్దని.. నిజాయతీ ఉంటే రూ.1200 కోట్ల బోనస్ బకాయిలు అకౌంట్లలో వేయాలని.. పిల్లి శాపాలకు ఉట్లు తెగయనే విషయాన్ని గ్రహించాలని సీఎం రేవంత్‌కు సూచించారు. గెలిచిన వాడు రాజు.. ఓడిపోయిన వాడు రావణాసురుడు అంటున్నాని.. రాహుల్ గాంధీ రావణాసురుడేనా ? ఉన్మాదంలో ఏం మాట్లాడుతున్నావో అర్థం కాదని.. హామీల గురించి ప్రశ్నిస్తున్నందుకు బూతులతో చెలరేగుతున్నా సంయమనాన్ని కోల్పోమన్నారు. ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా వెంటపడుతూనే ఉంటాయమని.. అబద్ధాల పుట్టను బద్దలు కొడుతామని స్పష్టం చేశారు

## మరో కొత్తరెండు మున్సిపాల్టీలు

**హైదరాబాద్ :** ష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపాలిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారం గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిన్నారం, ఇంద్రేశం ప్రాంతాలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా పెరుగుదల, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల నేపథ్యంలో ఈ డిమాండ్ తెరపైకి వచ్చిందిఈ రెండు గ్రామాలు పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. పటాన్ చెరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉండటం వల్ల జనాభా పెరుగుదల అధికంగా ఉంది. దీంతో ప్రాథమిక సదుపాయాలు, పట్టణీకరణ అవసరాలు పెరిగాయి. ఈ ప్రాంతాలు హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉండటం, ఇక్కడ పెద్ద ఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు సాగడం, రియల్ ఎస్టేట్ రంగంలో గణనీయమైన వృద్ధి కనిపించడంతో, పట్టణ అవసరాలు గ్రామ పంచాయతీల పరిధిలో తీర్చడం కష్టతరంగా మారింది. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచడానికి మున్సిపల్ హోదా అవశ్యకతను స్థానిక ప్రజలు, నాయకులు తెరపైకి తీసుకొచ్చారు.మున్సిపాలిటీలుగా మారితే నిధుల కేటాయింపులు పెరుగుతాయని.. తద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ వంటి సమీప గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారినందున జిన్నారం, ఇంద్రేశం కూడా మున్సిపాలిటీలుగా మారాలని డిమాండ్ బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలోనే జిన్నారం, ఇంద్రేశం గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని కూడా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ప్రభుత్వ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిమాండ్ నెరవేరిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలు మున్సిపాలిటీలుగా ఏర్పడటం వల్ల ఈ ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

# చేగుంట మండలంలో ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ..?

**అవగాహన లోపమా..సిబ్బంది నిర్లక్ష్యమా..?**

**విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల పారబోస్తున్న మావిస్ చాక్లెట్ పరిశ్రమ..**

**గ్రామపంచాయతీ ట్రాక్టర్లు తీసుకెళ్లి పారబోస్తున్న పంచాయతీ కార్మికులు..**

**పంచాయతీ కార్మికులు ప్రభుత్వానికి పనిచేస్తున్నారా లేక ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నారా ? అని విమర్శలు..పట్టించుకోని ఉన్నతస్థాయి అధికారులు..**







ప్లాస్టిక్ భూతంలా భయపెడుతోంది.ఇల్లు,వాకిలి, వీధి, కాల్వలు,చెరువులు,ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కమ్మేస్తోంది.ప్లాస్టిక్ ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా వినియోగం మాత్రం తగ్గడం లేదు.దీనికి ప్రజల అవగాహన లోపమా చేగుంట మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యమా..? అంటే అధికారుల నిర్లక్ష్యమే అని కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.అందుకు ఉదాహరణనే మండలంలోని రుక్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ఓ బావికి సమీపంలో స్థానికంగా ఉండే ఓ ప్రైవేట్ పరిశ్రమ బహిరంగంగా గ్రామపంచాయతీ ట్రాక్టర్ తో జోరుగా ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా పారబోస్తున్నారు.చేగుంట మండలంలో విచ్చలవిడిగా కవర్ల పారబోతనే దీనికి సంకేతం! 50 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది.దీన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి.ఫలితంగా పర్యావరణం దెబ్బతింటోంది.

**చేగుంట,జూన్24(సూర్యరేఖ)** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ పై యుద్ధం ప్రకటించాయి. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేదించినా..మండల కేంద్రమైన చేగుంట పట్టణంతో పాటు మండలంలో మాత్రం ప్లాస్టిక్ ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పాలిథీన్ కవర్లు విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ హెూల్సేల్ షాపులపై సంబంధిత శాఖ అధికారులు ఇంతవరకు దృష్టిపెట్టిన దాఖలాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి.కిళ్ళీ కొట్టు నుంచి సూపర్ మార్కెట్ వరకు ప్లాస్టిక్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.రోజుకు దాదాపు ఐదు నుంచి పది టన్నుల చెత్త సేకరించాల్సి ఉంది. అయినప్పటికి దీనిపై దృష్టి పెట్టడం లేదు. జాతీయ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 ప్రకారం 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచుల వినియోగం నిషేధం.వీటివల్ల పర్యావరణం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగం,విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని స్థానిక సంస్థలకు కేంద్రం ఆదేశాలు జారీచేసింది. అయినా సంబంధిత శాఖ అధికారులు ప్లాస్టిక్ నిషేధాన్ని సీరియస్ గా తీసుకోలేదు.కానీ దీనిని పక్కాగా అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

**నిబంధనలను అతిక్రమిస్తున్న మావిస్ చాక్లెట్ పరిశ్రమ..**

ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టినప్పటికీ చేగుంట మండలంలోని రుక్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మావిస్ చాక్లెట్ పరిశ్రమ మాత్రం పట్టించుకోవడం లేదు.తమ పరిశ్రమ లాభం కోసం ప్లాస్టిక్కు ఇష్టారీతిన వాడుతు...ప్లాస్టిక్ లేనిదే జీవితం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా ప్లాస్టిక్ వస్తువులు,సంచులు,బ్యాగులను రుక్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓ బావిలో గత ఐదు సంవత్సరాలుగా పారబోస్తున్నారని సదరు గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న అక్కల బాలు చెప్పడం ఒక విశేషమైతే గ్రామ పంచాయతీకి సంబంధించిన టీఎస్ 35 టిఏ 0393 అనే నెంబర్ గల ట్రాక్టర్లో ప్రతిరోజు ఈ ప్లాస్టిక్ కవర్లను పరిశ్రమ లోపల నుంచి గ్రామపంచాయతీ సిబ్బంది దగ్గరుండి తీసుకెళ్లి బావిలో పారబోయడం మరో విశేషం.

**-వేతనాలు ప్రభుత్వానియా లేక పరిశ్రమయా ?**

గత కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదని పంచాయతీ కార్మికులు ధర్నా చేస్తే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారి వేతనాలను విడుదల చేసింది.దీంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పని చేయాల్సిన గ్రామ పంచాయతీ కార్మికులు ప్రైవేట్ పరిశ్రమలోకి గ్రామపంచాయతీ ట్రాక్టర్లు తీసుకెళ్లి పారబోయంతో పంచాయతీ కార్మికులు ప్రభుత్వానికి పని చేస్తున్నారా లేక మావిస్ చాక్లెట్ పరిశ్రమలో పనిచేస్తున్నారా ? అనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

(నేడు మరిన్ని వివరాలతో మరో ప్రత్యేక కథనం)

# బీసీ రిజర్వేషన్లపై భిన్నస్వరాలు

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య నిర్మాణానికి మూలాధార స్తంభాలు. పంచాయతీలు, మున్సిపాలిటీలూ, నగరపాలక సంస్థలూ ప్రజలకు దగ్గరగా ఉండి సేవలు అందించే నియంత్రణ వ్యవస్థలుగా పనిచేస్తాయి. ప్రజల ప్రత్యక్ష ఓట్లతో ఏర్పడే ఈ శక్తి కేంద్రాల్లో అన్ని సామాజిక వర్గాలకూ సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్నదే రాజ్యాంగ లక్ష్యం. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని 42శాతం పెంచిన చట్టం చేసిన నేపథ్యంలో చట్టబద్ధత, ఎన్నికల నిర్వహణ, రాజకీయ ఉద్దేశ్యం వంటి అంశాల్లో వివాదాలు చెలరేగాయి. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో అమలులో ఉన్న 34 శాతంతో పోలిస్తే ఇది 8 శాతం పెంపు. బీసీలకు ప్రాధాన్యతనిచ్చే ఉద్దేశంతో పాటు, రాజకీయంగా వారిని ఆకర్షించాలన్న వ్యూహాత్మక దృష్టితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కానీ ఇది న్యాయపరంగా నిలబడగలదా? అన్న ప్రశ్న తీవ్రంగా ఉత్పన్నమవుతోంది. భారత రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణలు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గనిర్దేశం చేస్తాయి. అయితే సుప్రీం కోర్టు పలు తీర్పుల ద్వారా కొన్ని ప్రమాణాలను ఖరారు చేసింది ౦ రిజర్వేషన్ల మొత్తం 50 శాతాన్ని మించకూడ దన్నది ప్రధాన నిబంధన. అయితే తప్పని సందర్భాల్లో మూడు కీలక ప్రమాణాలు నిరూపించాల్సిన అవసరం ఉంది: (1) బీసీ జనాభా ఆధారిత విశ్లేషణ, (2) బీసీల రాజకీయ వెనుకబాటు నిర్ధారణకు నిపుణుల కమిషన్ నివేదిక, (3) 50 శాతం మించకుండా నియంత్రణ. తెలంగాణ ప్రభుత్వం తాజా నిర్ణయంలో ఈ మూడు ప్రమాణాల్లో ఏదీ నిరూపణకు నోచుకోలేదన్నది న్యాయవాదుల అభిప్రాయం. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ వ్యవధిపై ప్రభుత్వ అఫిడవిట్, ఎన్నికల కమిషనర్ అభిప్రాయాల్లో కూడా భేదాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం 30 రోజులు అవసరమని పేర్కొంటే, ఎన్నికల కమిషనర్ ప్రకారం రిజర్వేషన్ల పునర్విభజన, గెజిట్ ప్రకటన, డేటా పరిశీలన వంటి ప్రక్రియల నిమిత్తం 60 రోజులు అవసరమని స్పష్టం చేశారు. ఈ సమయ ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసం ఎన్నికల ప్రక్రియను మరింత ఆలస్యానికి గురిచేసే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అందులో 42 శాతం స్థానాలకు బీసీలకు రిజర్వేషన్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది. కొత్త రిజర్వేషన్ అమలుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. అయితే ఈ మొత్తాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వం నుంచి ఎన్నికల కమిషన్‌కు సరైన సమాచారం, సకాలంలో డేటా అందాల్సిన అవసరం ఉంది. ఇదే ఆలస్యం అయితే ప్రజాస్వామ్య పరిపాలనలో ఖాళీ ఏర్పడే ప్రమాదం ఉంది. రాజకీయ కోణంలో ఈ నిర్ణయం బీసీ వర్గాలను ఆకర్షించాలన్న వ్యూహంగా కనిపిస్తున్నా, న్యాయస్థానంలో దీని వెనుక ఉన్న ప్రక్రియ సుస్థిరంగా లేకపోతే, అధికార పార్టీకి పరాభవం తప్పదు. ఎన్నికల ప్రక్రియ ఆగిపోతే స్థానిక పరిపాలన కుంటు పడి ఎన్నికల నిర్వహణలో జాప్యం అనివార్యం కావచ్చు. ఇది ప్రజా ప్రజా ప్రతినిధులకు, పార్టీలకు మాత్రమే కాదు, ప్రజలకూ నష్టమే. ఇక కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా ప్రాధాన్యతగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర నిర్ణయంపై కేంద్రం స్పందించే విధానం విశేష చర్చకు దారి తీస్తున్నది. సాధారణంగా రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ప్రమేయం ఉండదు. కానీ రిజర్వేషన్ల విధానం రాజ్యాంగ పరిమితులకు విరుద్ధమైతే కోర్టు అభ్యర్థించిన సందర్భంలో కేంద్రం తన అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాలలో కేంద్రం తన అభిప్రాయాన్ని వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి ఓబీసీలకు రిజర్వేషన్ అవసరమే కానీ చట్టబద్ధత అవసరం అన్నదే కేంద్ర స్థాయి వైఖరి. ఇటీవల ఎన్డీఏ కూటమిలో కొత్త బీసీ నేతలకు ప్రాధాన్యత ఇచ్చినదాన్ని బీజేపీ వ్యూహాత్మక రాజకీయంగా పరిగణించవచ్చు. బీసీ ఓటు బ్యాంకును ఆకర్షించాలన్న రాజకీయ వ్యూహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బయటకు తటస్థంగా కనిపించడంతో పాటు లోపల రాజకీయ ప్రయోజనాలను కలిసివచ్చే రీతిలో వ్యవహరించ వచ్చన్న అనుమానాలు వెలుగు చూస్తున్నాయి. అయినా రిజర్వేషన్ వ్యవహారంలో మాత్రం కేంద్రం చాలా జాగ్రత్తగా స్పందించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక్కడ మరో కీలక అంశం ౦ జాతీయ బీసీ జనగణన డేటా లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం తక్కువ స్థాయిలో సర్వేలు, కమిషన్ నివేదికల ఆధారంగా రిజర్వేషన్లను సజావుగా అమలు చేయవచ్చన్న న్యాయ అభిప్రాయాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇలాంటివి చేపడితే కేంద్రం నుంచి వ్యతిరేక స్పందన తక్కువగా ఉండే అవకాశం ఉంది. గతంలో కేంద్రం తరచుగా రాష్ట్రాలకు స్వతంత్ర నిర్ణయాధికారం ఉందన్న అభిప్రాయాన్ని వెల్లడించిన సందర్భాలున్నాయి. తుది విశ్లేషణలో చూస్తే ౦ బీసీ రిజర్వేషన్ అంశం ఒక సామాజిక న్యాయ విధానం అయినప్పటికీ, అది రాజ్యాంగ ప్రమాణాలకు లోబడి

## సంపాదకీయం

# శాంతికి శరణ్యం ప్రజాస్వామ్యమే

శాంతి, సమభావం, సమిష్టి క్షేమమే ఆధునిక ప్రజాస్వామ్య యుగధర్మమని శ్రీశ్రీ పదేపదే వక్కాణించాడు. ప్రజాస్వామ్య పరిపాలనకు ఇదే గీటురాయిగా భావించాలని ఆ మహాకవి తీర్మానించాడు. మనం 21వ శతాబ్దంలో జీవిస్తున్నాం. 20వ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాలను విశ్వమానవాళి చవి చూసింది. మొదటి ప్రపంచయుద్ధ కాలం 1914-19. రెండవ ప్రపంచ యుద్ధ కాలం 1939-44. ఈ రెండు ప్రపంచయుద్ధాల్లో కోట్లాది మంది చనిపోయారు. మరికొన్ని కోట్లమంది క్షతగాత్రులయ్యారు. 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో జపాన్‌లోని హీరోషిమా, నాగసాకి ప్రజానీకంపై ఆమెరికా కురిపించిన ఆటంబాంబుల విషమ ఫలితాలను ఆ దేశం నేటికీ అనుభవిస్తూనే ఉన్నది. అయినా కొందరు దేశాధినేతలు (పాలకులు) ఇప్పటికీ కళ్లు తెరవక, చరిత్ర గుణపాఠాలు నేర్వక, ఆధిపత్య స్వార్థంతో, జాత్యాహంకారంతో, మతోన్మాదంతో యుద్ధాలకు తెగబడుతూనే ఉన్నారు. తానుపట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్టు మూర?ంగా వ్యవహరిస్తున్నారు. ఏకపక్షంగా యుద్ధ దాడులు చేస్తూ ఆయా దేశాలను లొంగదీసు కోవాలని చూస్తున్నారు. అక్కడి దేశవనరులు, సహజ సంపద, గనులు, చమురులను కొల్లగొట్టాలని పన్నాగాలు పన్ను తున్నారు. ఆ కారణంతో ఆ దేశ ప్రజలను నయాబానిసలుగా మార్చడం లేదా పొరుగుదేశాలకు కాందిశీకులుగా తరిమిగొట్టే నరరూప రాక్షసులుగా మారుతున్నారు. వీరు ప్రజల ప్రాణాలకు వీసమెత్తు విలువ నీయరు. కరడుగట్టిన అమానుషత్వమే వీరి నరనరాన జీర్ణించుకు పోయినట్టున్నది. పైపై రూపాలేమైనా కావచ్చుగానీ, కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లు అంతిమంగా ఇవి సామ్రాజ్యవాద మార్కెట్ దోపిడీకై సాగే యుద్ధాలని మనం మరువకూడదు. ఇజ్రాయిల్- పాలస్తీనా (గాజా)పై యుద్ధదాడి చేస్తూనే ఇప్పుడు తాజాగా మరల ఇరాన్‌తో యుద్ధపోరుకు తలబడింది. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇజ్రాయిల్ అతిదుర్మార్గంగా ఇరాన్‌లో చొరబడి యురేనియం శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేస్తున్నది. అణుబాంబు తయారీకి ఇరాన్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నదని, ఆ ముప్పునుండి తప్పించుకునేందునే తాము ముందస్తు దాడికి దిగామని ఇజ్రాయిల్ నేత నెతన్యాహు అంటున్నాడు. ఇరాన్ నేత ఖొమైనీ అంతమైతేనే యుద్ధానికి ముగింపు అని వాదిస్తున్నాడు. 'ఖొమైనీని మేం ఇప్పుడే చంపం. ఆయన ఎక్కడ దాక్కున్నాడో ఆ జాడ మాకు తెలుసు. అసలే మాకు ఓపిక తక్కువ. త్వరగా భేషరతుగా ఇరాన్ లొంగిపోతే మంచిది' అని ట్రంప్ తన వాచాలత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. అంతే కాదు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ప్రజలు ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నాడు. గాజా మాదిరి ఇరాన్‌ను కూడా ధ్వంసం చేసి చేజిక్కుంచు కోవాలనేది ట్రంప్ కుట్రగా కనపడుతున్నది. అయితే ఈ యుద్ధం ఎంత కాలం సాగుతుంది? ఎంత విధ్వంసం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు నిర్దాక్షిణ్యంగా గాలిలో కలసిపోతాయి? ఈ యుద్ధం పశ్చిమాసియా అంతా వ్యాపించి, కడకు మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తుందా..? అనేదే యావత్ మానవాళి ముందున్న ప్రశ్న. ట్రంప్ రెండో రాకడ అనంతరం యుద్ధజ్వాలలు ఎగిసేగిసి పడుతున్నాయి. తన జోక్యంతోనే శాంతి లభిస్తుంది అని ట్రంప్ ఎన్ని ప్రగల్భాలు పలికినా రష్యా ఉక్రెయిన్ యుద్ధం అంతం కాలేదు. గాజా సమూల ధ్వంసం వరకూ ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఆదేశ నేత నెతన్యాహూ ప్రకటిస్తునే ఉన్నాడు. ట్రంప్ కూడా తన టూరిజం, రిసార్టుల వ్యాపారం కోసం గాజా వాసులను ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయమని బెదిరి స్తున్నాడు.ఐక్యరాజ్యసమితి శాంతి నియమాలు, అంతర్జాతీయ కోర్టు నిబంధనలను వీరిరువురూ అసలు లెక్కజేయటం లేదు. భారత్- పాక్ మధ్య జరిగిన యుద్ధం తనవల్లే ఆగిందని ట్రంప్ ఒక పక్క చెప్తూనే మరో పక్క ఉగ్రవాద చర్యలకు ఊతం ఇస్తున్నాడు. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయిల్ కాలుదువ్వడానికి కారకుడ య్యాడు. ట్రంప్ అమానుష, నీతి బాహ్య చర్యలకు వ్యతిరేకంగా, సొంత దేశం అమెరికాలోనే లక్షలాది మంది ప్రజలకు 'నో-కెంగ్' ఉద్యమం పేరిట రోడ్ల మీదకు వస్తున్న విషయం తెలిసిందే. అయితే మన భారత దేశం తొలి నుండి శాంతి కాముకదేశం. సత్యం %-% అహింసల ప్రాతిపదికపై వెలసిల్లిన గౌతమ బుద్ధుని త్రిరత్నాలు దేశగతిని మార్చాయంటే అతిశయోక్తి కాదు. బుద్ధం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి శాంతి ఫరిడవిల్లడానికి కారణభూతమవు తున్నాయి. సంపూర్ణ వికాసం కోసం బౌద్ధం, శ్రమైక జీవనం కోసం సంఘం, పరస్పర శాంతి-సహకారం కోసం ధర్మం ప్రతి వ్యక్తికి అవసరం. ఈ మార్గంలోనే గ్రామాలు, నగరాలు, రాజ్యాలు, దేశాలు ప్రగతి పథంలో సాగుతున్నాయి. ప్రజాస్వామ్యానికి ఇదే ప్రాతిపదిక. ప్రజాస్వామ్యంలో చర్చలు ఉంటాయి. ఎదుటివారిని అర్థం చేసుకోవాలనే సంస్కారం ఉంటుంది. నాతో పాటు అందరూ సమానమే అన్న స్పృహ ఉంటుంది. ఇచ్చిపుచ్చు కునే గౌరవ మర్యాదలు ఉంటాయి. ఇలాంటి చోట ఆధిపత్యానికి అహం కారానికి తావే ఉండదు. ఉమ్మడి శ్రేయస్కరమే తప్ప రెండో మాటకు స్థానమే ఉండదు. ఇవన్నీ మన జీవన శైలిలో నిబిడీకృ తమై ఉన్నాయి. బౌద్ధాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించిన ఆశోకుని ధర్మచక్రాన్ని మనం మన జాతీయ పతాకంలో కేంద్ర స్థానంలో నిలుపు కున్నాము. చక్రంలోని 24 ఆకులు (రేఖలు) 24 గంటలకు సంకేతంగా నిరంతరం ధర్మపథంలో సాగాలని బోధిస్తున్నాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం ప్రపంచశాంతి కోసం ప్రప్రథమంగా 1949 ఏప్రిల్‌లో పారిస్‌లోనూ, ప్రాగ్‌లోనూ మహాసభలు జరిగాయి. 72 దేశాల నుండి రెండు వేలకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సమస్త దేశాల ప్రయోజనాలను రక్షించి సుస్థిర శాంతి స్థాపనే ప్రపంచ శాంతి సమితి లక్ష్యం అని ఉద్ఘాటించారు. 'మానవాళికి నేడు శాంతి అత్యంత ముఖ్యమై నది. శాంతి సాధనలో మనమంతా, సహచరులం' అని అప్పటి మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తెలిపారు. 'మారణా యుధాలను మనం నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం ఉత్తమం' అని జాన్.ఎఫ్. కెన్నడీ అదే సందర్భంలో అన్నారు. ఈ మాటలు చాలా విలువైనవి, ఆచరించదగ్గవి. ఆ తర్వాత మన దేశం అలీన దేశాల కూటమి స్థాపనకు, సారథ్యానికి కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి వచ్చినపుడు యావత్ దేశం రాజకీయా లకు అతీతంగా ఒక్కటిగా నిలిచింది. అలాగే ఇటీవల పహల్గాంలో ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా సాగిన ఆపరేషన్ సిందూర్ చర్యలకు దేశం ఒక్కటిగా మద్దతు తెలిపింది. విపక్షాలకు చెందిన శశిథరూర్, కనిమొళి, జాన్‌బిట్రాస్, అసదుద్దీన్ ఒవైసీ వంటి వారు విదేశీ వేదికలపై పాక్ ఉగ్రవాదాన్ని నిర్ద్వంద్వంగా ఎండగట్టారు. మన వైఖరి విస్పష్టంగా తెలిపారు. భారతీయుల శాంతి కాముకత విశ్వ వాప్తంగా మరోసారి వెల్లడైంది. 'భిన్నత్వంలో ఏకత్వమే మా బలం' అని భారత్ సగర్వంగా చాటగలిగింది. అయితే యుద్ధోన్మాద, ఉగ్రవాద మూలాలు తెలుసుకుని చైతన్యంతో వ్యవహరించడం సర్వదా శ్రేయస్కరం. పాకిస్తాన్ ఉగ్రవాదానికి అమెరికా ఊతం ఇస్తున్నట్టు తెలుస్తూనే ఉన్నది. ఈ ఉగ్రవాదం మత పరిధిని దాటి అమెరికాకు లంగిపోతున్నది. అమెరికా కూడా స్వీయ ప్రయోజనానికి ఉగ్రవాదాన్ని వాడుకుంటున్నది. చాలా ఉగ్రవాద సంస్థల మూలాలు మతోన్మాద గర్భంలో పురుడు పోసుకుం టాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి పుట్టిన వికృత కవలపిల్లలే ముస్లిం మతోన్మాదం - హిందు మతోన్మాదం అన్నది చరిత్ర కారుల వర్ణన. ద్విజాతి సిద్ధాంతాన్ని ఒకవైపు జిన్నా, మరోవైపు సావర్కర్ వంటి వారు బలపరచడంలో మన దేశం రెండు ముక్కలై లక్షలాదిమంది మృతదేహాల మధ్యన మనకు స్వాతంత్ర్యం లభించింది. అనంతరం హిందూ-ముస్లిం భారు భారు అని పిలుపునిచ్చిన మహాత్మాగాంధీ కూడా హిందూ మతోన్మాది గాడ్సే చేతిలో హతమ్వడం జగద్విదితం. యుద్ధోన్మాదం, మతోన్మాదం, ఉగ్రవాద హింసోన్మాదం ఇవి ఏవైనా ప్రజల ప్రాణాలను చాలా సులభంగా బలికొనేవే. ఆధిపత్య అహంకార పడగనీడలో ఇవి నిత్యం బుసకొడుతూనే ఉంటాయి. దీనికి విరుగుడు సత్యాహింసలతో కూడిన నిజమైన ప్రజాస్వామ్య మార్గమే శరణ్యమని మరోసారి మననం చేసుకోక తప్పదు.

# రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి ఘన సన్మానం





బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు

**బెల్లంపల్లి,జూన్24(సూర్యరేఖ)** హైదరాబాద్ బంజారాహిల్స్ లోని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బెల్లంపల్లిలోని 34 వార్డులలో ఇందిరమ్మ ఇల్లు,రాజీవ్ యువ వికాస్ పథకాల గురించి,అలాగే రానున్న వర్షాకాలం దుశ్య ముందస్తు నివారణ పట్టణంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించడం జరిగిందని,దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలుపడం జరిగిందని అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య తెలిపారు.అలాగే ఎమ్మెల్యే ఆదేశాలనుసారం కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు.అనంతరం బెల్లంపల్లికి అధిక నిధులు తీసుకువచ్చి బెల్లంపల్లి డెవలప్ చేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి బెల్లంపల్లికి చెన్నూర్,మంచిర్యాల్, చుట్టుపక్కల ఉన్న అన్ని నియోజకవర్గాలకు, తప్పకుండా న్యాయం జరిగేటట్టుగా తన ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల మల్లయ్య బండి రాము,రామగిరి శ్రీనివాస్,మేకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బిఐ బ్యాంకులో 12 మహిళా సంఘాలకు రూ.1.50 కోట్ల రుణాలు మంజూరు..





**బెల్లంపల్లి,జూన్24(సూర్యరేఖ)** పొదుపు సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు బాసటగా నిలవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.బెల్లంపల్లి మున్సిపాలిటీ లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఎస్బిఐ బ్యాంకులో 12 మహిళా సంఘాలకు రూ.1.50 కోట్ల రుణాలు మంజూరు చేసి వారికి అందజేశారు.మహిళా అభివృద్ధికి చేయూతను అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ మేనేజర్,మున్సిపల్ మున్సిపాలిటీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు,తదితరులు ఉన్నారు.

# సెయింట్ ఆనెస్ పాఠశాల వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ధర్నా





### సెయింట్ అనేస్ పాఠశాలను సీజ్ చేసిన ఎంఇఓ బాపిరెడ్డి




**ఉప్పల్,జూన్24(సూర్యరేఖ)** అనుమతులు లేకుండా నడుపుతున్న సెయింట్ ఆనెస్ పాఠశాల వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ధర్నా నిర్వహించారు. కుషాయిగూడ పారిశ్రామిక వాడ ప్రాంతంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పాఠశాలని వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.ఎట్టకేలకు సెయింట్ ఆనెస్ పాఠశాలను మంగళవారం కాప్రా ఎంఈఓ బాపిరెడ్డి సీజ్ చేశారు.ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో పాటు కార్పొరేటర్లు స్కూలు ఎదుట సుమారు రెండు గంటల ధర్నా చేశారు.పోలీసుల జోక్యంతో స్కూల్ లో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలతో తోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో ఫోన్ లో మాట్లాడి స్కూలు సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆందోళన విరమించారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,ప్రభుదాస్ సాయి జెన్ శేఖర్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ 11సంలు అందించిన విశేష సేవలకు గుర్తుగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం..



**నాంపల్లి,హైద్రాబాద్,జూన్24(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ లో గోల్కొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు కరుణకుమారి ఆద్వర్యంలో ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ 11సంవత్సరాలు అందించిన విశేష సేవలకు గుర్తుగా అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించి మొక్కలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమిందర్ రెడ్డి,అతిధులుగా గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమ మహేంద్ర,భాజపా సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ,లు పాల్గొని మొక్కలు పంపిణి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరు తల్లి పేరున ఓ మొక్కను నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ లీడర్లు గోవర్ధన్,డిజ్వేర్, సుధాకర్,సందేశ్ వివిధ మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ మాదకద్రవ్య అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్ విడుదల..




**ఉప్పల్,జూన్24 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్య,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ లో ఎడిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో టిజిఏఎన్.బి.సిఐ రామ్ ప్రసాద్,ఎస్ ఐ.చెన్నరాయుడు,రాజేష్ తదితర మాదకద్రవ్య వినియోగ నిరోధక అధికారులు పాల్గొన్నారు.వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ ని సందర్శించి విద్యార్థులకు పర్యవసనాలు చట్టాల పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కార్యక్రమం సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్, ఎడిసి సమన్వయ కర్త డా.ఆర్ చంద్రసాగర్,ఎన్ఎస్ ఎస్ పిఓ జె.విశ్వనాథ్ కుమార్,పి.విజయ్ కుమార్, డా.విశ్రీనివాసరావు డా.సిహెచ్ సత్యనారాయణ, డా.ఎన్ రాజశ్రీ,డా.జి.తిరుపతయ్య కె.గీత డా.ఎస్. యమున తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

### విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి యువత కృషి..

**పూర్తయిన విశ్వకర్మ యువ యాత్ర..**

**విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ ఫౌండర్ గా విశ్వనాధుల పుష్పగిరి**




**రాజేంద్రనగర్,జూన్24(సూర్యరేఖ)** ప్రతి ఒక్కరు విశ్వకర్మల ఐక్యత కోసం పనిచేయాలని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ ఫౌండర్ విశ్వనాధుల పుష్పగిరి అన్నారు. విశ్వకర్మలు రాజకీయంగా,సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు.విశ్వకర్మ యువ యాత్ర పేరుతో హైదరాబాద్ నుండి శ్రీశైలం వరకు బైక్ యాత్రను నిర్వహించారు.ఈ యాత్ర ద్వారా విశ్వకర్మ జాతికి ఐక్యత,పరస్పర స్నేహం,సామాజిక అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో చేపట్టారు.విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొలిటికల్ వింగ్ కన్వీనర్గా శ్రీశైలం విశ్వబ్రాహ్మణ సంఘంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనను నియమించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు.విశ్వకర్మ సమస్యలను ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని అన్నారు.ప్రభుత్వ పథకాలను సమాజానికి తెలియజేయడం జరుగుతుందని వివరించారు. విశ్వకర్మ యువతలో నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని వెల్లడించారు. ఉద్యోగావకాశాలు,ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పించి వారికి అవగాహనను పెంపొందించడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,యువజన విభాగం జాతీయ అధ్యక్షులు కూరెళ్ళ శివరామ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

# నెహ్రూనగర్ లో పర్యటించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు





**నెహ్రూనగర్ లో డ్రైనేజీ పైప్లైన్ ఏర్పాటుకు కృషి..**

**ఉప్పల్,జూన్ 24 (సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ నెహ్రూనగర్ లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు మంగళవారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. నెహ్రూ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ముత్తినేని జగదీష్,కమిటీ సభ్యులు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావును కలిసి కాలనీలో అత్యవసరంగా డ్రైనేజ్ లైన్ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తి చేశారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే నెహ్రూనగర్ బస్తీలో పర్యటించారు.బస్తి వాసుల సమస్యలను స్వయంగా పరిశీలించారు.ఈ పర్యటనలో కార్పొరేటర్ తో పాటు జలమండలి మేనేజర్ రవీందర్, సూపర్వైజర్ కిషన్ పాల్గొని సమస్యను పరిశీలించారు.కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు నెహ్రూనగర్ లో నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు.తక్షణమే డ్రైనేజ్ లైన్ నిర్మాణాన్ని ప్రారంభిస్తామని,దీనికి సంబంధించిన చర్యలు త్వరితగతిన తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముత్తినేని జగదీష్,ఉప్పలయ్య, సురేష్,ముత్యం సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నాయీబ్రాహ్మణులకు గ్రేవ్ యార్డులకు మహార్దశ

## నాయీబ్రాహ్మణుల గ్రేవ్ యార్డ్ కు రూ.40 లక్షల నిధులు మంజూరు..

## కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,జూన్24 (సూర్యరేఖ)** నాయీబ్రాహ్మణుల గ్రేవ్ యార్డు అభివృద్ధికి,మౌళిక సదుపాయాల కల్పనకు రూ.40లక్షల నిధులు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మంజూరు చేయించారు. పరమేశ్వర్ రెడ్డి కులపెద్దలకు నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం నిధులను మంజూరు చేయించారని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గ మిగతా ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు కూడా ఇదే తరహాలో నిధులను మంజూరు చేయించనున్నట్టుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నాయీబ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు తురాయి చంద్రమోహన్ పయ్యావులమోహన్ తురాయి మహేందర్, తురాయి భాస్కర్ మురళి రాకేష్,బద్రి నారాయణ శ్రీకాంత్,మధు,అరుణ్ కుమార్ తురాయి దాస్ దశరథ్ నాగరాజు కాంగ్రెస్ నాయకులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆగంరెడ్డి అమరేశ్వరి దేవి రెడ్డి జంగయ్య అంజయ్య మహేందర్ ముదిరాజ్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..




**ఉప్పల్,జూన్24(సూర్యరేఖ)** శాఖపరమైన మరమ్మతులు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈనెల 25వ తేదీ బుధవారం 11కెవి శిల్పారామం ఫీడర్ పరిధిలో ఉదయం11గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ భగయత్ ఏ.ఈ.బి కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆ సమయంలో ఉప్పల్ బాగాయత్,ఉప్పల్ శిల్పారామం,గ్రీన్ స్విచ్ అపార్ట్మెంట్స్,హెచ్ఎండిఏ వాటర్ ట్యాంక్ లైన్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.11 కెవి సత్యానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏ.ఈ. తెలిపారు. ఆ సమయంలో సత్యానగర్,శాంతినగర్, త్రీ కలర్ అపార్ట్మెంట్స్ వెంకటేశ్వర కాలనీ,ఆదిత్య హాస్పిటల్ లైన్,మైఫీల్ హోటల్ లైన్,నల్ల పోచమ్మ టెంపుల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏఈ కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ఉప్పల్ సెక్షన్ పరిధిలో..**

రాఘవేంద్రనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్న ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నిఖిల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆ సమయంలో శ్రీగిరికాలనీ,సాయిరాం నగర్,బీరప్పగడ్డ,బ్యాంక్ కాలనీ,ధర్మపురి కాలనీ, ప్రశాంత్ నగర్,రాఘవేంద్రకాలనీ, ఈస్ట్ కళ్యాణపురి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.11.కె.వి స్వరూప్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.ఆ సమయంలో సౌత్ స్వరూప్ నగర్,కేకేఆర్ గార్డెన్,గాంధీనగర్, అంబేద్కర్ నగర్,ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.విద్యుత్ వినియోగదారులు, వ్యాపారస్తులు తమ సిబ్బందితో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతు భరోసా సంబరాలకు హైదరాబాద్ తరలిన రైతులు..




**నిజాంపేట,జూన్24(సూర్యరేఖ)** హైదరాబాదులో నిర్వహించే రైతు సంబరాలకు నిజాంపేటమండల కేంద్రం నుండి మంగళవారం రైతులు తరలి వెళ్లారు.రైతులకు వ్యవసాయం పెట్టుబడి సాయం కింద రూ.12 వేల అందించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో సంబరాలు నిర్వహిస్తున్నారు.అనంతరం లబ్ధిదారులతో సీఎం మాట్లాడుతారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తరలి వెళ్తున్నామని రైతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి,విస్తీర్ణ అధికారి రమ్య,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,మెట్టు వెంకటేష్,విజయ్,కాకి రాజయ్య ఆంజనేయులు,రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం..

**సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ..**
**సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత రెట్టింపు..**
**రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్**



**రాజేంద్రనగర్,జూన్ 24 (సూర్యరేఖ)** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని,నేరాలను కట్టడి చేయవచ్చని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కండేయనగర్ హనుమాన్ దేవాలయం స్టేషన్ బుద్వేల్ అమ్మవారి దేవాలయాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎసిపి శ్రీనివాస్ సిఐ నరేందర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ...నేరాల నియంత్రణ,శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాలతో నేరాలు దొంగతనాలు జరిగినప్పుడు నేరస్తులను సులువుగా గుర్తించవచ్చన్నారు.అసాంఘిక శక్తులను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.అనేక క్లిష్టమైన కేసులను సీసీ కెమెరాల సాయంతో పరిష్కరించినట్టు వెల్లడించారు.ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు.కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా లాభాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆయా పరిసరాలలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో మార్కండేయ నగర్ హనుమాన్ దేవాలయం అధ్యక్షుడు గద్దె కృష్ణ,కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేష్,కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ..



**రామాయంపేట,జూన్24(సూర్యరేఖ)** యాదవుల హక్కుల కోసం పోరాడాలని,రాజకీయ ఆర్థికంగా బలోపేతం కావాలని బీసీ జనసభ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు యాదవ సంఘం రాష్ట్ర నాయకులు రాజారామ్ యాదవ్ పిలుపునిచ్చారు.ఈనెల 30న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన యాదవుల ఆత్మగౌరవ సభ పోస్టర్ మంగళవారం రామాయంపేటలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.జనాభా తమాషా ప్రకారం యాదవులకు ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని,యాదవ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 10 కోట్లు కార్పొరేషన్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మగౌరవ సభ నిర్వాహకులు మేకల కృష్ణ యాదవ్,యాదవ సంఘం నాయకులు పులపల్లి యాదగిరి యాదవ్, వూడెం దేవరాజ్ యాదవ్,బసనపల్లి రాజుయాదవ్,తాడెం మల్లయ్య అన్నమైన పోచయ్య,బత్తుల రాజు, బత్తుల రవి,బత్తుల శ్రీశైలం ఎర్రగోల రాములు, అన్నమైన రాజు,తదితరులు పాల్గొన్నారు.

సూర్య
బుధవారం 25 జూన్ 2025

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా





**సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం..**

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జూన్24(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారమే మా ఎజెండా అని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని శాంతినగర్ లో స్థానికుల విజ్ఞప్తి మేరకు సరైన రోడ్డు లేక ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని జిహెచ్ఎంసి అధికారులతో కలిసి నూతన సీసీ రోడ్డు,భూగర్భ డ్రైనేజ్ పైపులైన్ వ్యవస్థ కోసం పర్యటించారు. బస్తీలో పర్యటిస్తూ వీలు అయినంత త్వరగా నూతన ప్రణాళిక తయారు చేసి ప్రతిపాదనలు పంపించాలని ఆయన అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి పనులలో భాగంగా నూతన నిర్మించిన సిసి రోడ్డు పనులను అదే విధంగా నూతన రోడ్డుకు అనుసంధానం చేస్తూ మిగిలి ఉన్న రోడ్డు పనులను మంజూరుకు పంపించాలని అధికారులకు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ ను ఆదర్శంగా తీర్చి దిద్దడం జరుగుతుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనుల ఎక్కడ కూడా నాణ్యతలో రాజీ లేకుండా అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసు కొనిరావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడితే సహించేది లేదన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగ్ అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఇంకా డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానాని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. దశలవారీగా ప్రజల సమస్యల పరిష్కారమే ఏజెండాగా పనిచేస్తున్నానని వివరించారు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చారని ధ్వజమెత్తారు.420 హామీ పథకాలలో ఒకటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ వందలాది హామీలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓట్లు వేసి గెలిపించామా అని బాధపడు తున్నారన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరసింహ మూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, జలమండలి వినయ్,రమేష్,కైలాష్, అడికే శివ మొహమ్మద్ షకీల్ భాస్కర్ శివ ఉజ్వల్ రిషి,సైనీ పవన్ సైనీ,నిర్మల్ సైనీ,రంనివాస్ సైనీ,రామ్ కుమార్ సంక్లా,రవి,బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు

## రైతు భరోసా నిధులు ఏక కాలంలోనే రైతుల ఖాతాలో జామ







**హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు..**


**సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం..**

**నిజాంపేట,జూన్24(సూర్యరేఖ)** మండల కేంద్రంలో మంగళవారం రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రైతు భరోసా నిధులను ఏకకాలంలో రైతుల ఖాతాలో జమ హర్షించదగ్గ విషయమని రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు.గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి వారికి ఆశ్రయాన్ని కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం గృహినీలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సౌకర్యం అందించబడుతుందన్నారు.భూభారతి పోర్టల్ భూసమస్యలు ఉన్న ఎంతో మంది రైతుల బాసటగా నిలిచి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు 8వేల వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. అనంతరం టపాకాయలు పేల్చి




ఒకరికొకరు మిఠాయిలను పంచుకొని వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు.రైతు వేదికలో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన ప్రసంగాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,పట్టణ అధ్యక్షులు కొమ్మట బాబు,యూత్ అధ్యక్షులు రామచందర్ నాయక్ మండలవ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి విస్తీర్ణ అధికారులు రమ్య,మౌనిక, శ్రీలత కాంగ్రెస్ నాయకులు బాజారమేష్,పంజా మహేందర్ నసీరుద్దీన్ ఋషికేష్ అంజిరెడ్డి బోయిని చంద్రం శ్రీనివాస్ నాయక్,లింగస్వామి వై.వెంకటేశం, బొమ్మన శ్రీనివాస్,తుమ్మల రమేష్,లీడర్ ఎల్లం, మ్యాదరి నర్సింలు బన్నీ స్వామిగౌడ్,లక్ష్మణ్ గౌడ్ రాజునాయక్ నాగరాజు శ్రీశైలం,సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### తులసి మొక్కలు పంపిణీ చేసిన బిజెపి నాయకులు..



**రామాయంపేట,జూన్ 24(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణంలో మంగళవారం బిజెపి మహిళ మోర్చా ఆధ్వర్యంలో 11 సంవత్సరాల మోడీ సుపరిపాలన సందర్భంగా పట్టణ మహిళలకు తులసి మొక్కలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి మాట్లాడుతూ. పకృతికి చెట్ల యొక్క ఆవశ్యకత గురించి వివరించడం జరిగిందన్నారు.అలాగే మహిళలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరిస్తూ,మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. ముస్లిం మహిళలకు త్రిబుల్ తలక్ నుండి వెసులుబాటు కల్పిస్తూ చట్టసభల్లో బిల్లు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.మహిళలకు ప్రసూతి సెలవులు 12 వారాల నుండి 26 వారాలకు పెంచడం జరిగిందని ఆయన గుర్తు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అక్కల అనిల్ సీనియర్ నాయకులు శంకర్ గౌడ్,కొడపర్తి నరేందర్ చారి,బాసం అనిల్,ఎల్లంగౌడ్,కటిక కార్తీక్, నిమ్మలస్వామి,వరలక్ష్మి,బండారి రమ్య,జంగంపల్లి శిరీష,బి.ప్రవంతి,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎంత చెప్పినా అవి మోడీ బియ్యమే..

**జియాగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్**



**నాంపల్లి,హైద్రాబాద్,జూన్24(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోన్న బియ్యానికి కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తోందని భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ అన్నారు.ప్రధాని మోడీ ఫొటో ఉన్న ఫ్లెక్సీలు పెడితే చింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చెప్పినా అవి మోడీ బియ్యమే అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కాస్త విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటి నుంచీ లబ్ధిదారులకు సన్నబియ్యం ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేస్తూనే ఉందని గుర్తుచేశారు.ఇన్నేళ్లకు ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడం మొదలు పెట్టారని వెంకటేష్ యాదవ్ అన్నారు.ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే.ఈ పథకానికి లబ్ధిదారుల నుంచి అనుహ్య స్పందన వస్తోందని,రేషన్ దుకాణాల వద్ద భారీ సంఖ్యలో ప్రజలు క్యూ కడుతున్నారని అన్నారు.ఇక కేంద్రం సూచనలతో మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ఈ నెల 1వ తేదీ నుంచీ ప్రజలు రేషన్ కోసం బారులు తీరుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి నిలబడి రేషన్ తీసుకోవాల్సి వస్తోందని లబ్ధిదారులు చెబుతున్నారని వెంకటేష్ యాదవ్ అన్నారు

### రైతు భరోసా సంబరాలకు తరలివెళ్లిన రైతులు..




**రామయంపేట,జూన్ 24(సూర్యరేఖ)** హైదరాబాద్ సెక్రటేరియట్ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్నటువంటి రైతు భరోసా సంబరాలకు మంగళవారం రామాయంపేట మండల కేంద్రం నుండి రామాయంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో గల నిజాంపేట,రామాయంపేట నార్సింగి,చేగుంట మండలాలకు చెందిన 50 మంది రైతులు హైదరాబాద్ లో జరుగుతున్న రైతు భరోసా సంబరాలకు ఆర్టీసీ బస్సులో తరలివెళ్లడం జరిగిందని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ డివిజన్ పరిధి రైతులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..



**రామాయంపేట,జూన్ 24(సూర్యరేఖ)** రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో 23 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయి. అందులో ఇండ్లు మంజూరు అయిన 8 మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముగ్గు పోయడం జరిగింది.ఈ సందర్భంగా ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు మాట్లాడుతూ...నిరుపేదలైన తమకు ఇండ్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ఈ శుభ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

సూర్య


# సిగరెట్ పడుతున్న యువత..

**ప్రమాదమని తెలిసినా మానలేని వ్యసనం..**
**ధూమపానానికి బానిసలవుతున్న యువత..**
**మద్యం..జూదం కంటే ప్రమాదం..**
**అలవాటైతే మానుకోవడం కష్టమే..**





ధూమపానం ప్రాణాలు తీస్తుందని తెలిసిన ఆ వ్యసనం బారిన పడినవారు బయటపడలేక పోతున్నారు.ఈ మధ్యకాలంలో పొగ తగడం ఫ్యాషన్ గా మారింది.పొగతాగడం ప్రాణాంతకం అని తెలిసినా ఒక్కసారి ఆ మహమ్మారి బారికి అలవాటు పడితే మానలేకపోతున్నారు.మద్యం కంటే పొగ తాగడం ప్రమాదం అని చెప్పిన పెడ చెవిన పెడుతున్నారు.ధూమపానానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్న ఒకట్రెండు రోజులు మానుకొని తిరిగి కొనసాగిస్తున్నారు గుండె సంబంధమైన వ్యాధులు ఉన్న వారు సైతం తాత్కాలిక విరమణ చేస్తూ తిరిగి ఈ మహమ్మారికి బానిసలుగా మారుతున్నారు. ఒక్కసారి పొగ తాగడం అలవాటయితే మారడం మన చేతుల్లో ఉండదు. సిగరెట్ తాగడం మొదలుపెట్టేటప్పుడు ఆలోచించాలి.ఒక్కసారి రుచి చూశారా ఇక మీరు వదిలేద్దామనుకున్నా అది మిమ్మల్ని వదలదు.

**చేగుంట,జూన్23(సూర్యరేఖ)** పొగ తాగని వాడు దున్నపోతై పుడతాడు అనే మాట వినో...మన అభిమాన హీరో కాలుస్తున్నాడు అనో.. ఏదో సమస్య వచ్చిందనో..ధూమ పానం మొదలు పెట్టామా ఇక అంతే సంగతులు.ఆ తర్వాత మనం వద్దనుకున్నా కుదరదు.ధూమపానం ఎంత ప్రమా దమో అలవాటు చేసుకున్న వారు ఎటువంటి అనారోగ్యాల బారిన పడతారో పొగ తాగే ప్రతి ఒక్కరికీ తెలుసు.మద్యం వంటి వాటిని కూడా దూరంగా పెట్టగలుగుతున్నాం కానీ సిగరెట్ను కాదనుకోలేకపోతున్నా మంటూ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. అంతర్గత ఆందోళన ఉన్నమగ వారు సిగరెట్, బీడీలు తాగుతూ సుఖం పొందుతూ ఉంటారు. ఇది మగవారికే పరిమి తం కాదు. పొగ తాగడా నికి అలవాటు పడిన మహిళలు కౌమార దశ లో ఉన్న పిల్లలు కూడా ఇదే ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.ఇదే విషయాన్ని సర్వేలు కూడా నిర్ధారిస్తున్నాయి.

**-మానసిక స్థితిపై ధూమపాన ప్రభావం..**

ధూమపానం బారిన పడినవారి మానసికస్థితిపై ధూమపాన వ్యతిరేక పోరాట పునరుద్ధరణ అంతర్జాతీయ కమిషన్ గత ఏడాది సర్వే నిర్వహిం చింది.సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచ బ్యాంకు తదితర సంస్థల గణాంకాల ప్రకారం భారతదేశంలో దాదాపు 25 కోట్ల మంది 16 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు వారు ధూమపానానికి బానిసలైయ్యారు.వీరిలో మహిళ లు 4శాతం ఉన్నారు.ఈ అలవాటుతో నోటి క్యాన్సర్ వంటి వ్యాధులతో ఏడాదిలో దాదాపు 5 లక్షలకు పైగా మృతి చెందుతున్నారు. ధూమపాన ప్రియుల్లో 37 శాతం మంది అలవాటును మాను కోవాలని ఆశిస్తున్నా వారి వల్ల కావడం లేదు. కేవలం 5శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఆ పని చేయగలుగుతున్నారు.ఈ వ్యసనాన్ని వదిలించుకునే వారి సంఖ్య మిగతా దేశాల వారితో పోలిస్తే భారత్లో చాలా తక్కువ.కౌమార ఉన్న వారు వీటి బారిన దశలో బయటపడలేకపోతున్నారు.

**-దేహంపై శాశ్వత ప్రభావాలు..**

ధూమపానం అలవాటుతో దేహంపై శాశ్వత ప్రభావాలను గుర్తించలేకపోతారు.తల నుంచి కాలి వేలు చివర వరకు ప్రభావితమవుతాయి.మొదటగా చెవి,ముక్కు,గొంతు వంటి భాగాలు తమ స్వశక్తిని కోల్పోతాయి.దీంతో ఆ భాగాల్లో నికోటిన్ వచ్చే వ్యర్థాలు పేరుకుపోయి ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. సిగరెట్ తాగే వారి చర్మంతో పాటు, ఊపిరితిత్తులు ఆ తరువాత గుండె దెబ్బతినడం ప్రారంభమవు తాయి. రక్తప్రసరణ క్రియ తగ్గిపోయి హార్ట్ ఎటాక్ కు దారితీస్తుంది.ఎముకలు బలహీన పడిపోయి తొందరగా దెబ్బతింటాయి.ఎక్కువ కాలం సిగరెట్ తాగేవారు పొట్ట క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంటుంది.అదే పనిగా తాగడం వల్ల చేతులు వణకడం,చిరాకు వస్తాయి.లేని మనుషులు కనబ డటం,లేని మాటలు వినబడటం,ఎక్కడో ఉన్నా మనే భ్రమలో ఉండటం సమస్యలు కనబడతాయి.

**-వ్యాయామమే మందు..**

ఎటువంటి వ్యసనాన్ని అయినా దూరం చేసే శక్తి ఒక్క వ్యాయామానికే ఉంటుంది.వ్యాయామంతో మెదడులో సంతోషంతో ముడిపడే డోపామైన్, సెరోటోనిన్,ఎండార్ఫిన్ వంటి న్యూరో ట్రాన్స్మిటర్లు స్థాయి పెరుగుతుంది.ధూమపానం తరహాలో ఇవి శరీరంలో ఉత్సుకతను కల్పిస్తాయి. వ్యాయామాల తో వీటి స్థాయి పెరిగి పొగ తాగాలన్న కోరిక తగ్గిపోతుందని నిపుణులు తెలుపుతున్నారు. నికోటిన్ రీప్లేస్ మెంట్ థెరపీ ద్వారా ధూమపానం మానివేసే అవకాశం ఉంటుంది.నికోటిన్ గమ్స్ తీసుకోవడం ద్వారా క్రమేపి బయటపడవచ్చు. మద్యం,జూదానికి బానిసలైన వారిని దూరం పెట్టినంతగా సమాజం పొగతాగేవారిని పెట్టదు. పొగతాగే వారి పట్ల కుటుంబ సభ్యులు పెద్దగా ఆందోళన వ్యక్తం చేయరు.ఈ అలవాటు వ్యసనంగా మారడానికి ఇది కూడా మరో కారణం.జేబులో పట్టేంత సైజులో అందుబాటులో ఉండటం..ఫ్యాషన్తో ప్రారంభమై చివరకు అవసరం లేకపోయినా చాలామంది అదే పనిగా తాగుతుంటారు.సరదాగా ప్రారంభమైన ఈ వ్యసనం శరీరాన్ని రోగగ్రస్థంగా మార్చి చివరకు ప్రాణాలు తీస్తుందన్న నిజాన్ని గ్రహించలే కపోతున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**కామారెడ్డి,జూన్24(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నాగిరెడ్డిపెట్ మండలము పోచారం గ్రామంలో రైతుభరోసా తొమ్మిది రోజుల వ్యవధిలో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం పట్ల డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్,రామచంద్రా రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

## నషముక్త భారత్ అభియాన్ లో అందరూ భాగస్వాములు కావాలి

**శివంపేట మండల పరిధిలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ**




**శివంపేట,జూన్24(సూర్య రేఖ)** మాదక ద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని శివంపేట మండల పరిధిలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ తెలిపారు.ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు.చిన్నతనంలోనే మాదక ద్రవ్యాల గురించి తెలుసుకోవడం వల్ల ఆరోగ్యం చాలా కాపాడుకోవచ్చ న్నారు.సమాజాన్ని కూడా కాపాడవచ్చని తెలిపారు. చిన్నతనం నుండే మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎవరైనా ఎక్కడైనా అమ్మిన లేదా వాడకంలో ఉన్న వారిని వెంబడి గుర్తించి తెలియపరిచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి కరుణ షీలా,ఐసిడిఎస్ మండల సూపర్వైజర్లు వసుమతి సంతోష,కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఫిర్దోష్ మెహద,మిషన్ కోఆర్డినేటర్ సంతోషి,కళాశాల సిబ్బంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల,సంబరాలలో రైతులు

**కూరాకుల కృష్ణ**



**నాంపల్లి,జూన్24(సూర్యరేఖ)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిందని కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్వాన్ నియోజకవర్గం ఏబ్లాక్ అధ్యక్షులు కురాకుల కృష్ణ అన్నారు.ఈ సందర్భంగా మంగళవారం కార్వాన్ లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కురాకుల కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లోకి జమచేస్తుందన్నారు.3 ఎకరాల లోపు భూమి కల్గిన రైతులకు విడుదల చేసిందని,త్వరలో రూ.9 వేల కోట్లు ప్రజా ప్రభుత్వం బదిలీ చేయనున్నట్లు తెలిపారు.ఎకరానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున మొదటి విడతగా రూ.6 వేల చొప్పున 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా చేరాయని,రూ.కోటి 49 వేల ఎకరాలకు చెల్లింపు చెల్లింపులు జరిగినట్టు వివరించారు.ప్రభూత్వ ప్రజా పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నాయకులు కార్యకర్తలు ఎప్పటి కప్పుడు ఎక్కడి కక్కడ ఎండగట్టాలని సూచించారు.ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు పూర్తి నిబ్బదతతో కాంగ్రెస్ ప్రభూత్వం పనిచేస్తుందని ప్రతిపక్షాలు గుర్తుంచుకోవాలని అన్నారు.

# గుండ మన్విత జన్మదినం సందర్భంగా సాయి భోజన్







**గర్భిణులకు బాలింతలకు డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం..**
**బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం..**

**బెల్లంపల్లి,జూన్24(సూర్యరేఖ)** బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయిభక్తి ప్రచార ధార్మిక సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు గుండ పూజిత రాజకుమార్ ఆర్థిక సహకారంతో వారి కూతురు గుండ మన్విత పుట్టిన రోజు సందర్భంగా వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు,బాలింతలకు,డయాలసిస్ రోగులకు అన్నార్తులకు సాయిభోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ - రాజేశ్వరి తెలిపారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు,బాలింతలు రోగులు అన్నార్తులు ఆసు పత్రి సిబ్బంది,సాయి భోజన్ అన్నదాన కార్యక్ర మాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ,బాయిజమ్మ సాయి సేవాట్రస్ట్ వారికి దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం-అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి పిలుపునిచ్చారు.సేవే లక్ష్యం,సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య శ్రవిద్య త్రయాక్షర్ పేర్కొన్నారు.ఈ సేవా కార్యక్రమ ములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు జేరిపోతుల రాజేశ్వరి సేవకులు పోతురాజుల తిరుపతి రావుల స్వామి సాయిబాబా దాతలు గుండ పూజిత రాజకుమార్ గుండ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునే వారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975,9949041595 సంప్రదించాలని తెలిపారు.

# విరివిగా కనిపిస్తున్న ఆరుద్ర పురుగులు







**ఆరుద్ర పురుగు కనిపిస్తే ఆనందం వ్యక్తం చేసే రైతులు..**
**ఆరుద్ర పురుగు పై సూర్యరేఖ ప్రత్యేక కథనం..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,జూన్ 24(సూర్యరేఖ)** చూడగానే ముద్దొచ్చే రూపం..ఎర్రని తివాచీ సున్నితత్వం..ముట్టుకుంటే మాసిపోతాయేమోనని పించే అందం..దానికి తోడు ఆపన్నహస్తాన్ని అందించడంలో వీటికి సాటేదీ లేదనడంలో అతిశయోక్తి లేదు.ఈ భూమి ఎన్నో కోట్ల జీవులకు ఆవాసం. మనుషులతో పాటు పశు పక్షాదులు,కీటకాలు,రకరకాల పురుగులు, బ్యాక్టీరియా ఈ నేలపై ఉంటాయి. అయితే కొన్ని రకాల పురుగులు కొన్ని ప్రత్యేక సీజన్లలో మాత్రమే కనిపిస్తూ ఉంటాయి.అలానే ఇప్పటి జనరేషన్ వాళ్లకు తెలియని పురుగులను ఇప్పుడు "సూర్యరేఖ" పాఠకులకు పరిచయం చేయబోతుంది. అవేంటబ్బా అని ఆలోచిస్తున్నారా.? అవేనండీ. మన రైతునేస్తాలైన ఆరుద్ర పురుగులు వానలు ప్రారంభం కావడంతో ఈ పురుగులు దర్శనమిస్తున్నాయి. దీంతో రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.కాలం కలిసొచ్చినట్లే నని పంటలు బాగా పండుతాయని సంబురపడి పోతున్నారు. కీటక జాతికి చెందిన ఆరుద్ర పురుగులను 'మినుగులు','ఆరుద్ర పువ్వు లు' అని పిలుస్తారు.ఈ ఆరుద్ర పురుగు యొక్క శాస్త్రీయ నామం ట్రోంబిడియం.ఏడాదికి ఒక్కసారి మాత్రమే కనిపించే ఈ ఆరుద్ర పురుగు పేరు మీద తెలుగులో సామెతలు కూడా ఉన్నాయి.ఎప్పుడో ఒక సారి కనిపించే వ్యక్తులను, అరుదుగా వచ్చే అతిథిని ఆరుద్ర పురుగుతో పోల్చుతుంటారు. పూర్వ కాలంలో ఈ ఆరుద్ర పురుగులు ఎక్కువగా కనిపించేవి.క్రిమి సంహారక మందుల వాడకం వల్ల,పంట పొలాల్లో రసాయన ఎరువుల వినియోగం ఇటీవలి కాలంలో ఎక్కువైపోయింది. దీంతో పాటు పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో ఆరుద్ర పురుగుల ఉనికి ప్రశ్నార్థకమైంది.గ్రామీణ ప్రాంతంలో బాల్యంలో ఆరుద్ర పురుగులను ఎక్కువగా చూసిన వారు, వారి బాల్యాన్ని గుర్తు చేసుకుంటారు. ఎప్పుడూ భూమి లోపల నివాసం ఉండే ఈ ప్రత్యేకమైన పురుగులు, వర్షకాలం తొలకరి జల్లులు కురిసినప్పుడు మాత్రమే బయటకు వచ్చి కనువిందు చేస్తాయి.ఇవి ఎంతో ప్రత్యేకం.ఎరుపు రంగులో కనిపించే ఈ పురుగులు వేలి గోరంత పరిమాణంలో ఉంటాయి.కొన్ని ప్రాంతాల్లో వీటిని కుంకుమ పురుగులు అని కూడా అంటారు. కీటకాలను చూస్తేనే ఆమడదూరం పారిపోయేవారు సైతం వీటిని పట్టుకోకమానరు.తొలకరి వర్షాల అనంత రం 15 రోజులకు వచ్చే కార్తె ఆరుద్ర కార్తె..కానీ ఈ కార్తె రాక ముందే ఆరుద్ర పురుగులు రైతులను మురిపింప జేస్తున్నాయి.వీటికి,రైతులకు అవినాభావ సంబంధం ఉంది.మినుగులు విరివిగా కనిపిస్తే ఆ ఏడాదంతా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయన్న నమ్మకం అన్నదాతల్లో ఉన్నది. అందుకే నాటి నుంచి నేటి వరకు ఆరుద్ర పువ్వుల ఆగమనాన్ని రైతులు శుభపరిణామంగా భావిస్తారు.

**-రైతుకు మేలు చేసే ఆరుద్ర..**

అందానికే కాదు..ఆపన్న హస్తాన్ని అందించడంలో తనకు సాటి మరెవరూ లేరని ఆరుద్ర మురిసిపోతుంది.తొలకరి దుక్కుల్లో పంటనాశన కీటకాలను ఈ మినుగులు నాశనం చేస్తాయి. పంటను నాశనం చేసే కీటకాలతో పాటు వాటి గుడ్లను సైతం ఇవి తినేయడంతో మొక్కలు బలంగా ఎదిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. అన్నదాతకు తెలియకుండానే ఆయన కష్టాలను పాలుపంచుకుంటూ పంటను కాపాడుతుంది.

**-మందుల తయారీలోనూ..**

ఆరుద్ర పువ్వులను ఆయుర్వేదిక్ మందుల తయారీలోనూ ఉపయోగిస్తారు.పురుగుల ద్వారా తీసే నూనెను హెర్బల్ మెడిసిన్,వివిధ ఔషధాల్లోనూ వినియోగిస్తారు.పాన్ మసాలా తయారీలోనూ ఈ నూనెను వాడతారు.

**-కనుమరుగవుతున్న ఆరుద్ర...**

మనిషి స్వార్థం కోసం విచ్చలవిడిగా ఎరువులు, రసాయనాలను వాడుతూ పుడమి తల్లిని కాలుష్యం చేస్తున్నారు.దీంతో రైతులకు ఎంతో మేలు చేసే కీటక జాతి అంతరించి పోతున్నది. అందులో ఒకటి ఆరుద్ర పురుగు.కొన్ని ప్రాంతాల్లో ఈ పురుగులకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో వాటిని సేకరించి విక్రయించిన ఘటనలూ ఉన్నాయి.ఈ పురుగులను 2017,18 సంవత్సరాల్లో ఇతర దేశాలకు స్మగ్లింగ్ చేశారన్న వార్తలొచ్చాయి.రైతులకు లాభసాటి పంటలను అందించడంలో తోడుండే ఆరుద్ర పురుగులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.ఆరుద్ర పురుగు వచ్చిందంటే ఏడాదంతా వర్షాలే ! వర్షాకాలం ఆరంభంలో,ఆరుద్ర కార్తె ప్రారంభంలో కనిపించే ఈ ఎర్రని పురుగు ఎంతో ప్రత్యేకమైనది.ఈ పురుగు కనిపించిందంటే చాలు ఆ ఏడాదంతా భారీ వర్షాలు కురుస్తాయని నమ్ముతారు రైతులు. కాలువలు, కుంటలు నీటితో నిండి,పంటలు సమృద్ధిగా పండుతాయని విశ్వసిస్తారు.ఎర్రగా కనిపించే ఈ కుంకుమ పువ్వుల రాకను ఎంతో శుభసూచికంగా భావిస్తారు.వర్షా కాలంలో వ్యవసాయం పనులు మొదలు పెట్టకముందుకే కనపడే పురుగు. ఆరుద్ర పురుగు.ఎర్రటి వస్త్రాన్ని చుట్టుకున్నట్లుగా కనిపించే ఈ పురుగు ఎరుపు రంగులో బొద్దుగా ఎంతో అందంగా కనిపిస్తుంది.ఈ పురుగు పంటలకు ఎలాంటి హానీ చేయదు.ఆరుద్ర కార్తె ప్రారంభంలో ఏడాది ఒక సారి మాత్రమే ఈ పురుగు కనిపిస్తుంది. ఎర్రగా,బొద్దుగా. చూడటానికి ఎంతో అందంగా ఉండే ఆరుద్ర పురుగును ఇంద్రగోప చందమామ లేడీ బర్డ్, కుంకుమ పురుగులు ఇలా రకరకాల పేర్లతో దీన్ని పిలుస్తూ ఉంటారు.మనం తాకితే ఈ పురుగులు కాసేపు అక్కడే ఆగిపోతాయి. అప్పట్లో పిల్లలు ఈ పురుగులతో ఆడుకునేవారు. ఇప్పుడు వాటి గురించి చెప్పేవారు కూడా కరువయ్యారు. ఆరుద్ర పురుగుల మనుగడను పరిరక్షించేందుకు రైతులు సైతం తమవంతుగా తోడ్పాటు అందించాలి. పంటలపై రసాయనాల స్థానంలో సహజమైన రీతిలో తెగుళ్లను నియంత్రించే పదార్థాలను ఉపయోగించాలి. పురుగుల ఆవాస నాశనాన్ని పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలి. ఇలాంటి చర్యలు ద్వారా ఆరుద్ర పురుగులను ముప్పు బారి నుంచి కాపాడవచ్చు.

## బీజేపీ నాయకుడు శివకుమార్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేవర శ్రీనివాస్



**నాంపల్లి,జూన్24(సూర్యరేఖ)** కద్తాల్ మండలం మైసిగండి గ్రామంలో కొలువైయున్న మైసిగండి మైసమ్మ అమ్మవారి సన్నిధిలో భారతీయ జనతా పార్టీ సీనియర్ డైనమిక్ లీడర్,కార్వాన్ కన్వీనర్ శివ కుమార్ యాదవ్ మొక్కులు చెల్లించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు,కార్యకర్తలు శివ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆతిథ్యం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ పాల్గొని శివ కుమార్ యాదవ్ ను శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఆశీర్వదించారు.

## ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న సోలార్ ప్లాంట్లపై చర్యలు తీసుకోండి

**పది సంవత్సరాలుగా టాక్స్ ఎగ్గొడుతున్న సోలార్ ప్లాంట్లు**
**రైతులు నడిచే నక్ష బాటలు, నీటిపారుదల కాలువలు ఎలా మూసివేస్తారు**
**అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బ్రహ్మం**



**టేక్మాల్,జూన్24(సూర్య రేఖ)** గత 10 సంవత్సరాలుగా పంచాయతీలకు పన్ను కట్టకుండా సోలార్ ప్లాంట్ నిర్వాహకులు సుమారు రూ.కోటి 15 లక్షల ప్రభుత్వానికి చెల్లించడం లేదని అల్లాదుర్గం నియోజకవర్గం సాధన సమితి అధ్యక్షులు బ్రహ్మం ఆరోపించారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ...టేక్మాల్ మండలంలోని సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, దినకర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ ప్లాంట్ లో కాకుండా వివిధ ప్లాంట్ల వద్ద చట్ట విరుద్ధంగా రైతుల నడిచే నక్ష బాట నీటిపారుదల కాలువలు మూసి వేయడం ఏమిటని ప్రశ్నించారు. సీతానగర్ నుండి బాచారం,కోరంపల్లి నుండి టేక్మాల్,పల్వంచ నుండి తాండ,అనేక కాల్వలు ఉన్నాయని వీటిని మూసి వేయడం వల్ల రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వీటిపై కలెక్టర్కు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.దుబ్బగుట్ట నుండి నక్ష బాట,కాలువలు మూసివేసి కాంపౌండ్ వాల్,నిర్మించడం వల్ల వెంకటేశ్వర ఆలయానికి వెళ్లడానికి జాతర సమయంలో భక్తులకు అంతరాయం ఏర్పడుతుందని,రైతులు పొలాలకు వెళ్లేందుకు అనేక కష్టాలు గురవుతున్నారని పేర్కొన్నారు.దీనిపై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసిన సోలార్ ప్లాంట్లపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు.నక్షబాట కాలువలపై ఇప్పటికైనా అధికారులు చట్ట విరుద్ధంగా కట్టిన కాంపౌండ్ గోడనిర్మాలను తొలగించాలని,ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారని ప్రజలకు న్యాయం జరగకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి వస్తుందని తెలిపారు.అలాగే సామాన్య పేదవాడు ఇంటి విద్యుత్ బిల్లు ఒక్క నెల బిల్లు చెల్లించకపోతే విద్యుత్ అధికారులు విద్యుత్ నిలిపివేస్తారు.కానీ ఇక్కడ సంబంధిత అధికారులు కొన్ని సంవత్సరాలుగా పంచాయతీలకు అనగా బాచారం,హాసన్ మహమ్మద్ పల్లి ఎలకుర్తి, కాదులూరు,సాలోజిపల్లి,కోరంపల్లితో పాటు టేక్మాల్ పంచాయతీలకు పది సంవత్సరాలుగా టాక్స్ పన్ను రూ.కోటి 15 లక్షలు చెల్లించాల్సి ఉన్న, ప్రైవేట్ సోలార్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోకుండా ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం దురదృష్టకరం అని బ్రహ్మం తెలిపారు. వెంటనే సోలార్ ప్లాంట్ నిర్వాహకులు నక్ష బాటలను,కాలులను వదిలేయాలని,పంచాయతీలకు టాక్స్ చెల్లించాలని లేనియెడల,న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## కామారెడ్డిలో ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల అక్రమాలపై తనిఖీలు నిర్వహించండి....!

**విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మీర్కర్ వినయ్ కుమార్**



**కామారెడ్డి,జూన్24(సూర్యరేఖ)** ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ నడుస్తున్న కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రాజుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మీర్కర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ..జిల్లా కేంద్రంలో కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమాలను బేఖాతరుగా ఉల్లంఘిస్తూ వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు.దీంతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు.పాఠశాలల్ని విద్యాలయాలుగా కాక వ్యాపార కేంద్రాలుగా మార్చి,పుస్తకాలు,యూనిఫాంలు,స్టేషనరీ వస్తువులను బలవంతంగా అమ్మిస్తున్నారనీ పాఠశాలలలో కనీస భద్రతా, మౌలిక సదుపాయాలు కూడా లేకుండా వివిధ పేర్లతో ఫీజులను వసూలు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.తక్షణమే తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుని విద్యారంగాన్ని ప్రైవేటీకరణ నుండి రక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సేన నాయుకులు గుమ్ముల మధు,అమన్,అనిల్,సురేష్,నాగ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా సంబరాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రామాయంపేట, జూన్24 (సూర్యరేఖ)** రామాయం పేట మండల కేంద్రంలోని మెదక్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం క్రింద రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి,స్థానిక మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలభిషేకం చేశారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారి పై టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ. గతంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన రైతు రుణమాఫీ,రైతులకు యాసంగి పంటకు బ్యాంక్ ఖాతాలో రైతు భరోసా డబ్బులు,ఎకరాకు 6వేలు జమ చేయడం సంతోషమన్నారు.మన రాష్ట్రంలో రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. కొంతమంది రైతులకు రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నాయని దాన్ని కూడా మాఫీ చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.రైతులకు సబ్సిడీ పథకాలు డ్రిప్ పరికరాలు అన్ని సకాలంలో అందిస్తూ అభివృద్ధివైపు అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలో నిరుపేదలకు 4000 వేల లక్షల ఇందిరమ్మ ఇండ్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు.నిజాయితీగా రైతులకు రుణమాఫీ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు రైతులకు సకాలంలో రైతు భరోసా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పిస్తాం





**బస్ స్టాండ్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్**

**కామారెడ్డి,జూన్24(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ను రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్,జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మి కాంతారావు,జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్,జిల్లా ఎస్పీ రజేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..మదన్ మోహన్ ఎప్పుడు కలిసిన ఎల్లారెడ్డికి బస్ డిపో అడుగుతుండే వారని అన్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సహాయం చేయడానికి ఆయన శాసన సభ్యులు అయ్యారని గుర్తు చేశారు. హైదరాబాద్ లో ఎప్పుడూ కలిసిన ఎల్లారెడ్డి బస్ డిపో అడుగుతారని తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం రాకముందు ఆర్టీసీ మూతపడే పరిస్థితి ఉండేదని,ఒక్క కొత్త బస్సు కొనలేదని,ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడగానే 48 గంటల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు.ఇప్పటి వరకు రూ.190 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించామని,రూ.6300 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో నై చెలెగ బస్సు క పయ్య అని ఉద్యమాన్ని చేశారన్నారు.వారు సమ్మె చేసి మరణిస్తున్న పట్టించుకోలేదని,మా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. రెండు కొత్త బస్సు డిపోలు పెద్దపల్లి జిల్లా కేంద్రం ములుగు,జిల్లాలోని ఏటూరు నాగారంకు అందించామన్నారు.ఎల్లారెడ్డి బస్ డిపోపై ముఖ్య మంత్రి గారితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు.చరిత్రలో 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పంట పెట్టుబడి సహాయం అందించామన్నారు. గతంలో పంట పెట్టుబడి సహాయం మూడు నెలల వరకు ఇచ్చేదని,తాము 9 రోజుల్లో 9 వేల కోట్లు వేశామన్నారు.దేశంలో 29 రాష్ట్రాలు ఉంటే సన్న బియ్యం పంపిణీ తెలంగాణ లో మాత్రమే ఇస్తున్నామని 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కు గ్యాస్,సన్న వడ్లు బోనస్,రైతు రుణమాఫీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు.10 ఏళ్లలో ఎంత మందికి డబుల్ బెడ్ రూం లు ఇచ్చారన్నారు.మేము ఒక సంవత్సరంలోనే ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని,పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే కార్యక్రమం ప్రభుత్వం తీసుకుందని అన్నారు.10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారా. ఇప్పుడు అప్లికేషన్ పెట్టుకోగానే రేషన్ కార్డు ఇస్తున్నామని తెలిపారు.నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచడానికి రాజీవ్ యువ వికాసం తీసుకొస్తున్నామని,కరీంనగర్ ఎంపీగా ఢిల్లీ వేదికగా సోనియా గాంధీ గారిని ఒప్పించడానికి శక్తి మేర పని చేశానని,10 ఏళ్లలో ఆర్థిక విధ్వంసం చేశారన్నారు.అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు.విద్యార్థి రైతు,కార్మికులు సంతోషంగా ఉండేలా అనేక కార్యక్రమాలు చేశామన్నారు.మదన్ మోహన్ కు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.బస్ స్టేషన్ నిర్మాణం,కొత్త బస్సుల ఏర్పాటు పై వారికి అభినందనలు అన్నారు.జుక్కల్ ఎల్లారెడ్డికి అను సంధానంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ మాట్లాడుతూ..మంత్రి మన ప్రాంతానికి రావడం మన అదృష్టమని,వెనుకబడ్డ ప్రాంతం బస్ స్టాండ్ లేక వానలో వానకు, ఎండలో ఎండకు తడిచే వాళ్ళమన్నారు.బస్సే మనకు పరమావది అని,బస్ పేదోడి ఏయిర్ పోర్ట్ బస్ స్టాండ్ అన్నారు.బస్టాండ్ ఏర్పాటు చేసినందుకు సీఎం,డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదములు తెలిపారు.9 నెలల నుండి నిధులను సేకరించి బస్టాండ్ నిర్మాణం పూర్తి చేశామన్నారు.బస్సులు ఎక్కితే కానీ జీవం లేదు ఇక్కడి పజలకు విద్యార్థులు రైతు కుటుంబాలనుంచి వచ్చినవారే ఉన్నారని అన్నారు. బస్ డిపో ఏర్పాటు 40 ఏండ్ల ఆకాంక్ష అని వివరించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఎల్లారెడ్డికి బస్ డిపో మంజూరు చేయాలని ప్రజల తరపున కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నటరాజన్ చేతుల మీదుగా

### పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రం అందుకున్న అబ్దేసి సదాలక్ష్మి




**రాజేంద్రనగర్,జూన్24(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శిగా కుమారి అబ్దేసి సదాలక్ష్మి నియామక పత్రం అందుకున్నారు. మంగళవారం గాంధీభవన్ లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నటరాజన్,పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ చేతుల మీదుగా సదాలక్ష్మి నియామక పత్రాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచే విధంగా పనిచేయాలన్నారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నటరాజన్ మాట్లాడుతూ... పార్టీ కోసం పనిచేసే నాయకులు,కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.పార్టీ అధిష్టాన పనిచేసే నాయకులకు ప్రాధాన్యతనిస్తుందన్నారు.పార్టీ పదవులను చిన్నచూపు చూడవద్దని ఈ పార్టీ పదవులే మిమ్మల్నీ పెద్ద నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. అందుకోసం అంకితభావంతో పార్టీ కోసం పనిచేసే ప్రజలకు సేవలు అందించాల్సిందిగా ఆకాంక్షించారు.

## జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు చేపట్టాలి

**బీఆర్ఎస్ నాయకులు జె రవీందర్**



**మందమర్రి,జూన్24(సూర్య రేఖ)**వాస్తవాలను వెలుగులోకి తెచ్చే విలేకరుల ఓపై సోషల్ మీడియాలో అహంకార పూరితంగా రెచ్చిపోయి జర్నలిస్టులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకునిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ పట్టణ నాయకులు జె రవీందర్ డిమాండ్ చేశారు.మంగళవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ..పట్టణ పాత్రికేయులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజలకు రాజకీయ నాయకులకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్న విలేఖరులకి రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పాత్రికేయులు అందరూ కలిసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వెనుక ఆంతర్యం ఏమిటని,వెంటనే కేసు నమోదు చేయాలన్నారు. పోలీసులు అధికార పార్టీ నాయకుల కోసం కాకుండా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహించాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇష్టారీతిన వ్యవహరించడంపై రాష్ట్ర కార్మిక,మైనింగ్ శాఖల మంత్రి వివేక్ స్పందించి తక్షణమే కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని కోరారు.లేని పక్షంలో జర్నలిస్టుల నుండి వ్యతిరేకత ఎదుర్కోక తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్,సీనియర్ నాయకులు ఓ రాజశేఖర్,మద్ది శంకర్,ఎండీ అబ్బాస్,బండారి సూరిబాబు,నలువల సమ్మయ్య, కొంగల తిరుపతిరెడ్డి,బర్ల సదానందం,మల్లేష్,తోట సురేందర్ కనకం రవీందర్,ఎండి ముస్తఫా పూసాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## నీటిశుద్ధి కేంద్రాన్ని సందర్శించిన జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్



**మెహదీపట్నం,జూన్24(సూర్యరేఖ)** నగరంలోని ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్స్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ను ట్రాన్స్మిషన్,క్యూఏటి అధికారులతో కలిసి మంగళవారం జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సందర్శించారు.ఈ సందర్భంగా క్లోరిన్ ప్లాంట్, ఫిల్టర్ బెడ్,లను పరిశీలించిన ఈడీ లాబ్లోని నీటి నాణ్యత పారామీటర్లను తనిఖీచేశారు.అలాగే వర్షాకాలం నేపథ్యం లో నీటిశుద్ధి ప్రక్రియలో వినియోగించే రసాయనాలను సకాలంలో కొనుగోలుచేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్,ట్రాన్స్మిషన్ సీజీఎం బ్రిజేష్ క్యూఏటి జీఎం శ్రీనివాస్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి హాజరైన కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్








**బెల్లంపల్లి,జూన్24(సూర్యరేఖ)** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ మంగళవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన కామర్స్ సమావేశంలో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆరవ వార్షిక సమావేశం సందర్భంగా "వికసిత్ భారత్ 2047 ట్రాన్స్ఫర్ వే టు రూల్ ఆఫ్ కామర్స్లి అనే ప్రత్యేక సదస్సును నిర్వహించారు.తెలంగాణ విశ్వవిద్యాలయ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రిన్సిపాల్,కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కాంపల్లి శంకర్,లు హాజరయ్యారు. "టూరిజం మీట్స్ ఫైనాన్స్..గ్రీన్ ఇన్వెస్ట్మెంట్స్ ఫర్ ఏ సస్టేనేబుల్ ఫ్యూచర్" అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు.పర్యాటక రంగం..ఆర్థిక రంగం. పెట్టుబడి రంగం..స్థిరమైన భవిష్యత్తు అనే అంశాల మేళవింపుగా పలు విషయాలు చర్చించారు. ఆయన ప్రస్తావించిన ఆయా విషయాలను ఈ సమావేశానికి హాజరైన ప్రముఖులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టరెడ్డి తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్టర్ ప్రొఫెసర్ మాదారపు యాదగిరి,డీన్,హెడ్ గోపిశెట్టి రాంబాబు ప్రొఫెసర్ పురుషోత్తం రావు,ప్రొఫెసర్ చెన్నప్ప,ప్రొఫెసర్ రవికుమార్ జాస్తి,అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రాజ్ కుమార్ డాక్టర్ జి.శ్రీనివాస్, ప్రొఫెసర్లు,అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు,యూనివర్సిటీ బోధన సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## వసీం అక్రం, షేన్ వార్న్ కాదు!..

## నన్ను భయపెట్టింది ఆ బౌలరే: గంగూలీ

భారత క్రికెట్లో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న ఆటగాళ్లలో సౌరవ్ గంగూలీ ఒకడు. కెప్టెన్గా భారత జట్టు దశ దిశను మార్చిన ఘనత అతడి సొంతం. అంతేకాదు.. సచిన్ టెండుల్కర్, రాహుల్ ద్రవిడ్లతో కూడిన తన సమకాలీన అత్యుత్తమ బ్యాటర్ల జాబితాలో స్థానం సంపాదించాడు దాదా. విదేశీ గడ్డపై తాను ఎదుర్కొన్న ప్రతీ బౌలర్పై గంగూలీ ఒకానొక సందర్భంలో పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. 1992లో వెస్టిండీస్తో వన్డే మ్యాచ్తో అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టిన దాదా.. 1996లో టెస్టుల్లోనూ అరంగేట్రం చేశాడు. పదహారేళ్ల తన సుదీర్ఘ కెరీర్లో టీమిండియా తరఫున 113 టెస్టులు ఆడిన గంగూలీ.. పదహారు శతకాల సాయంతో 7212 పరుగులు సాధించాడు. అదే విధంగా.. 311 వన్డేల్లో ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ 11363 పరుగులు చేశాడు. ఇందులో 22 సెంచరీలు, 72 అర్ధ శతకాలు ఉన్నాయి. ఇంతటి అనుభవం, అసాధారణ నైపుణ్యాలు ఉన్న గంగూలీని భయపెట్టిన బౌలర్ ఎవరో తెలుసా?.. దాదానే స్వయంగా ఈ విషయం గురించి మాట్లాడాడు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను ఎదుర్కొన్న బౌలర్లలో తనను ఎక్కువగా భయపెట్టింది

ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్ గ్లెన్ మెగ్రాత్ అని గంగూలీ తెలిపాడు. తన కెరీర్లో ఎదుర్కొన్న అత్యుత్తమ బౌలర్ల జాబితాలో భాగమైన పాక్ పేస్ లెజెండ్ వసీం అక్రం, ఆసీస్ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ల పేర్లు కాకుండా దాదా మెగ్రాత్ పేరు చెప్పడం విశేషం. కాగా 1999-2011 మధ్య ఆస్ట్రేలియా అత్యంత పటిష్టమైన జట్టుగా కొనసాగింది. మూడుసార్లు వరుసగా కంగారూ జట్టు వన్డే వరల్డ్కప్ అందుకుంది. ఇక ఆసీస్ ప్రధాన బౌలర్లలో ఒకడైన మెగ్రాత్ది ఇందులో కీలక పాత్ర. ఈ రైటార్మ్ పేసర్ 1993- 2007 మధ్య ఆస్ట్రేలియా తరఫున 124 టెస్టుల్లో 563 వికెట్లు పడగొట్టాడు. అదే విధంగా.. 250 వన్డేల్లో మెగ్రాత్ 381 వికెట్లు కూల్చాడు. రెండు టీ20 మ్యాచ్లలో కలిపి ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఐపీఎల్లో ఒకప్పటి ఢిల్లీ డేర్డెవిల్స్ ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు మెగ్రాత్ ఆడాడు. క్యాష్ రిచ్ లీగ్లో మొత్తంగా 14 మ్యాచ్లు ఆడి 12 వికెట్లు తీశాడు.

# బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించాలని పోరాడుతా

మా న్యాయ పోరాటానికి కేంద్రం ఇచ్చిన గౌరవమిది..

అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాలు ఉద్యమంలో న్యాయం ఉందని,కేంద్రమిచ్చిన పద్మశ్రీ పురస్కారమే సాక్ష్యం..

లోకసభలో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్నట్లే.. రాజ్యసభలో కూడా రిజర్వేషన్లు కల్పించాలి

భూమిని జాతీయం చేయాలి..

న్యాయ వ్యవస్థలో కూడా రిజర్వేషన్లు కల్పించాలి..

కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఎన్నికల సమయంలో ఇస్తానన్నా రూ.6 వేల ఫించనును ఇవ్వాలి..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ







**రాజేంద్రనగర్,జూన్24(సూర్యరేఖ)** బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్ల అమలు కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) మున్ముందు ఉద్యమాలను చేపడుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ తెలిపారు. మంద క్రిష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇచ్చిన నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ,ఎస్టీ అధ్యాపకులు తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం, వ్యవసాయ, వెటర్నరీ,ఉద్యాన విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంద క్రిష్ణ మాదిగ మాట్లాడుతూ. ఎమ్మార్పీఎస్ ఎస్సీ రిజర్వేషన్ల సాధన కోసం 30 సంవత్సరాల పాటు జరిపిన ఉద్యమం నయమైందన్నారు.అందుకే అన్ని కమిషన్లు రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చాయని గుర్తు చేశారు.అసెంబ్లీలో జరిగిన తీర్మాణాలు కూడా ఎస్సీ రిజర్వేషన్లకు అనుకూలంగానే తీర్మాణాలు చేశాయన్నారు. రాష్ట్రపతి నుంచి అన్ని వర్గాల వారు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైనదని గుర్తించారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తీర్పు ఇవ్వడానికి సహకరించిన ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాలుగా మేం నిర్వహిస్తున్న ఉద్యమంలో న్యాయం ఉందనడాని కేంద్రమిచ్చిన పద్మశ్రీ పురస్కారమే సాక్ష్యం. ఓఎస్సీ రిజర్వేషన్ల సాధన పేరిట నిర్వహించిన పోరాటాలు మానవీయ కోణాల్లో సాగాయి.హృద్రోగ బాధిత పిల్లలు దివ్యాంగులు వితంతువులు వృద్ధులు ఇతర వర్గాలవారికి ఎక్కడ అన్యాయం జరిగినా...మేం అండగా నిలిచాం.ఈ పురస్కార ప్రకటన నా బాధ్యతను మరింత పెంచింది.నా విధ్యుక్త ధర్మాన్ని గుర్తుకు తెచ్చిందన్నారు.లోకసభలో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్నట్లే రాజ్యసభలో కూడా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.చట్టాలు అమలు చేసే లోక్సభలో రిజర్వేషన్లు ఉన్నప్పుడు రాజ్యసభలో కూడా ఉండాలని గుర్తు చేశారు. అంబేద్కర్ కాలం నుంచి రాజ్యసభలో రిజర్వేషన్లు లేవని,వాటిని కల్పించాలని పోరాడుతామన్నారు. అదే విదంగా న్యాయ వ్యవస్థలో కూడా రిజర్వేషన్లు లేవని,ఆ విషయంలో కూడా ఎమ్మార్పీఎస్ ఆలోచిస్తుందన్నారు. న్యాయవ్యస్థలో ఉన్న కోలోజియం కులైజంగా మారి పోయిందని గుర్తు చేశారు.భూమిని జాతీయం చేయాలని అంబేద్కర్ కాలం నుంచి చెప్పడం జరిగిందని,ఆ విషయంలో ప్రభుత్వాలు ఆలోచించాలన్నారు.ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ కాలంలో పేదలకు భూములు పంచారని,అప్పట్లో ప్రజలు ఇందిరాగాంధీని అమ్మగా పిలిచేవారన్నారు.ఆ భూములను తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైకుంఠ థామాలు,కలెక్టర్ కార్యాలయాలు,ప్రకృతి వనాలు,క్రీడా ప్రాంగాణాల పేరుతో కరోనా సమయంలో లాగేసుకున్నారన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానన్న ముఖ్యమంత్రి పేదల భూములు లాక్కుంటే తాము అధికారంలోకి వచ్చాక లాక్కున్న భూములను తిరిగి ఇచ్చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 18నెలలు కావస్తున్నా నేటికి ఇవ్వక పోవడం భాదాకరమన్నారు.భూమి ఉంటే పేదలు దళితులలో ఆత్మస్థైర్యం ఉంటుందని అందుకే భూమిని జాతీయం చేయాలని పోరాడుతామన్నారు.గతంలో అన్ని రంగాలు జాతీయం ఉండేవని,నేడు చాలా వరకు ప్రైవేటు పరం అవుతున్నాయని,ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పోరాడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులకు ఎన్నికల సమయంలో ఇస్తానన్నా రూ. 6వేల ఫించనును ఇవ్వాలనే డిమాండ్ తో జూలై ఒకటి రెండవ తేదీలలో కార్యచరణ సిద్ధం చేసి పోరాడటానికి శ్రీకారం చుడతామన్నారు. ఎమ్మార్పీఎస్ అంటే సామాజిక న్యాయం కోసం పోరాటం చేసే సంఘం అని గుర్తు చేశారు.ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి ఎస్సీలలోని 59 ఉప కులాలకు న్యాయం చేయాలని ఆలోచన చేసి విజయం సాదించిన సంఘం అని గుర్తు చేశారు. అందుకే ఆ పోరాటానికి అన్ని వర్గాల నుంచి సహకారం అందిందన్నారు.సామాజిక సహకారంతోనే తాము ఈ విజయాలు సాదించగలిగామన్నారు. ఓఎమ్మార్పీఎస్ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంతో పాటు "చిన్న పిల్లలకు గుండె అపరేషన్లు,ఆరోగ్య శ్రీ,వికలాంగుల పించన్లు పెంపు లాంటి అనేక ఉద్యమాలు చేసి విజయం సాదించడు జరిగిందని గుర్తు చేశారు.

**ఘన సన్మాణం..**

వ్యవసాయ,వెటర్నరీ,ఉద్యాన విశ్వవిద్యాలయాలు శాస్త్రవేత్తలు,విద్యార్థులు,ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంద క్రిష్ణ మాదిగకు ఘన సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఒంటి గంటలకు రావాల్సిన ముంద క్రిష్ణ మాదిగ 4-30 గంటలకు వచ్చినా శాస్త్రవేత్తలు విద్యార్థులు ఆయన కోసం వేచి చూశారు. సాయంత్రం 7:45 వరకు కార్యక్రమం జరిగినా అం దరు ఆయన ప్రసంగం వినడానికి వేచి ఉన్నారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ బి.విద్యాసాగర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ రేవీ ఈశ్వరి రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్,తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షులు డాక్టర్ పవన్ చంద్రారెడ్డి,ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.కమలాకర్, ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రతినిధులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కళాదర్ బాబు పీవీ నరసింహారావు పశు వైద్యవిశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణ అధ్యాపకులు డాకర్ జే సురేశ్,విద్యార్థి సంఘం నాయకులు వినయ్, రాజ్కుమార్,మదిలేటి మాదిగ,వనం నర్సింహ్మా మాదిగ,పోతురాజు యాదయ్య మాదిగ క్యాసారం శంకర్రావు మాదిగ, వనాగారి రాంచందర్ మాదిగలతో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు,బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నీరసపడిన అధికార పార్టీ సోషల్ మీడియా

**హైదరాబాద్ :** 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికలు అత్యంత చురుకుగా, ఉత్సాహభరితంగా కనిపించాయి.ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ యుగంలో పార్టీల గెలుపు ఓటములు, పథకాల అమలు, ఇతర అంశాలన్నీ సోషల్ మీడియా ద్వారానే ప్రజలకు చేరుతున్నాయి. దీంతో నేతల పనితీరుకు సోషల్ మీడియా కొలమానంగా మారింది. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపు, బీఆర్ఎస్ ఓటమికి సోషల్ మీడియా కీలక పాత్ర పోసించింది. అయితే ఇప్పుడు అధికార కాంగ్రెస్ సోషల్ మీడియా బలహీనపడింది. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికలు అత్యంత చురుకుగా, ఉత్సాహభరితంగా కనిపించాయి. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో, కాంగ్రెస్ సోషల్ మీడియా బృందాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు, ప్రజల సమస్యలను హైలైట్ చేయడం, పార్టీ హామీలను ప్రచారం చేయడంలో నిరంతరం కృషి చేశాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, సోషల్ మీడియా వారియర్స్ నిమిషం నిమిషం కొత్త వ్యూహాలతో ప్రత్యర్థి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పై దాడి చేశారు. ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్), ఫేస్బుక్, వాట్సాప్ వంటి ప్లాట్ఫారమ్లలో వీడియోలు, మీమ్స్, గ్రాఫిక్స్, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పరచుకున్నారు. ఈ కాలంలో, సోషల్ మీడియా యాక్టివిస్టులు పార్టీ కోసం అహర్నిశలు పనిచేసి, ఎన్నికల విజయంలో కీలక పాత్ర పోషించారు.2023 డిసెంబర్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, సోషల్ మీడియా వేదికల ఉత్సాహంలో మార్పు కనిపిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత, సోషల్ మీడియా ద్వారా ప్రజలతో సంబంధం కొనసాగించడంలో కొంత నీరసం కనిపిస్తోంది. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉండగా చూపిన చొరవ, ప్రభుత్వంలోకి వచ్చాక కొంత తగ్గినట్లు ఎక్స్లో కొన్ని పోస్టులు సూచిస్తున్నాయి. ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంలో సోషల్ మీడియా బృందాలు కొంత వెనుకబడినట్లు విమర్శలు వస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రత్యర్థులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండగా, కాంగ్రెస్ ఈ విషయంలో వ్యూహాత్మకంగా స్పందించడంలో వెనుకబడినట్లు కనిపిస్తోంది.ఎన్నికల విజయంలో సోషల్ మీడియా వారియర్స్ శ్రమ అపారమైనది. వీరు గ్రామీణ స్థాయి నుంచి నగరాల వరకు పార్టీ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటుతున్నా, ఈ కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవులు లభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిద్రాహారాలు మాని పనిచేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కృషిని పార్టీ నాయకత్వం గుర్తించడం లేదనే ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పార్టీలో అంతర్గత అసంతృప్తిని పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా వ్యూహం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే భిన్నంగా ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కీలకం. ఉదాహరణకు, ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయవచ్చు. అయితే, ప్రస్తుతం ఈ దిశలో చురుకైన ప్రయత్నాలు కొరవడినట్లు కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్పర్సన్ సుప్రియా శ్రీనాటే నాయకత్వంలో ప్లాట్ఫారమ్లు బలోపేతమైనప్పటికీ, రాష్ట్ర స్థాయిలో ఇదే స్థాయి చురుకుదనం కనిపించడం లేదుసోషల్ మీడియా కార్యకర్తలకు పదవులు, గుర్తింపు ఇవ్వడం కేవలం వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే కాదు, పార్టీని బలోపేతం చేయడానికి కూడా అవసరం. ఈ కార్యకర్తలు గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు పార్టీ సందేశాన్ని అందించగల సామర్థ్యం కలిగి ఉన్నారు. వీరికి తగిన ప్రోత్సాహం, బాధ్యతలు అప్పగించడం ద్వారా సోషల్ మీడియా బందాలు మరింత ఉత్సాహంగా పనిచేస్తాయి. సోషల్ మీడియా కమిటీలలో బాధ్యతలు ఇస్తే, ఇది ఇతర కార్యకర్తలకు స్ఫూర్తిగా ఉంటుంది. గుర్తింపు లేని కార్యకర్తలలో నిరాశ పెరిగితే, భవిష్యత్ ఎన్నికలలో సోషల్ మీడియా శక్తి బలహీనపడే ప్రమాదం ఉంది.

## ప్రియుడి కోసం తల్లిని చంపిన మైనర్ బాలిక

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో దారుణం జరిగింది. 10వ తరగతి చదువుతున్న బాలిక ప్రియుడితో కలిసి కన్నతల్లిని చంపేసింది.. మానవ సంబంధాలను ప్రశ్నార్థకం చేసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రేమ వ్యవహారం తెలిసి తల్లి మందలించిందన్న కోపంతో తన ప్రియుడు, అతని తమ్ముడుతో కలిసి కూతురు కన్నతల్లినే చంపేసింది.. జీడిమెట్లలోని ఎన్ఎల్బీ నగర్లో ఈ దారుణ ఘటన జరిగింది. 10వ తరగతి చదువుతున్న తేజశ్రీకి.. నల్లగొండకు చెందిన పగిల్ల శివ (19) అనే యువకుడితో 8 నెలల క్రితం ఇన్స్టాగ్రామ్లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసుకుంది. డీజే ప్లేయర్ అయిన శివ ? తేజశ్రీ ఫోన్లు, మెసేజ్లతో ప్రేమలో మునిగిపోయారు. అయితే.. వీరిద్దరి ప్రేమ వ్యవహారం తల్లికి తెలిసింది. ఈ వయసులో ఇది సరైన పద్ధతి కాదని? బాగా చదువుకోవాలని కూతురిని మందలించింది. తమ ప్రేమకు అడ్డుగా ఉన్న తల్లిని చంపేయాలని డిసైడ్ అయింది. ఈ విషయాన్ని ప్రియుడు శివకు చెప్పింది. ఇద్దరూ కలిసి హత్యకు స్కెచ్ వేశారు. అందుకు శివ తన తమ్ముడు పగిల్లా యశ్వంత్(18) సహాయం తీసుకున్నాడు. ఈ క్రమంలో శివ, యశ్వంత్ ఇంటికి రాగా.. తేజశ్రీ కలిసి ముగ్గురూ కలిసి ఒంటరిగా ఉన్న తల్లిని కిరాతకంగా చంపేసారు. స్థానికుల ఫిర్యాదుతో జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.. ఐదు రోజుల క్రితం తేజశ్రీ ప్రియుడితో కలిసి ఇంట్లో నుంచి వెళ్ళిపోయింది.. ఈ క్రమంలోనే.. మైనర్ బాలికతో పాటు ఇద్దరు అబ్బాయిలు నిన్న సాయంత్రం ఇంటికి వచ్చి చున్నీతో ఉరివేసి తలపై బాది అంజలిని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. చంపిన చున్నీని నిందితుడు నడుముకి కట్టుకొని పోలీస్ స్టేషన్ కు వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.తేజశ్రీ తల్లి అంజలి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఫోక్ సింగర్గా ఉన్నారు. తొర్రూరు దగ్గర ఇనుగుర్తి స్వగ్రామం. కూతురే తల్లిని ఇలా దారుణంగా చంపేయడంతో ఆ కళాబృందంలో సభ్యులంతా ఇప్పుడు షాక్లో ఉన్నారు.అంజలి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఐదు రోజుల క్రితం తేజశ్రీ ప్రియుడితో కలిసి ఇంట్లో నుంచి వెళ్ళిపోయిందని.. ఈ విషయం గురించి పోలీసులకి ఫిర్యాదు కూడా చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిన్న సాయంత్రం ఐదు గంటల సమయంలో చిన్న కూతురు లేని సమయంలో పెద్ద కూతురు ప్రియుడుతో కలిసి హత్య చేసినట్లు తెలిపారు. చిన్న కూతురు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం తమకు తెలిసినట్లు తెలిపారు.

## స్వదేశానికి పెద్ద ఎత్తున ఇండియన్స్


**న్యూఢిల్లీ :** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య టెన్షన్లు తగ్గలేదు. 11 రోజులుగా జరుగుతున్న యుద్ధంతో అక్కడి జనజీవనం భయానకంగా మారింది. జెరూసలెం లాంటి కొన్ని నగరాలైతే ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు . ఇటు.. యుద్ధభూమి నుంచి భారత పౌరులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ సింధు కొనసాగుతోంది. ఐదు రోజుల్లో ఇరాన్ నుంచి ఎనిమిది విమానాల్లో 1700 మందికి పైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. 162 మంది భారతీయులు ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్ సరిహద్దు దాటి వచ్చారు. టెల్అవీవ్లోని భారత రాయబార కార్యాలయంనుంచి బస్సుల్లో భారతీయులను జోర్డాన్కి తరలిస్తున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తీసుకొస్తున్నారు.అటు.. ఇరాన్ నుంచి ఇజ్రాయిల్ నుంచి సొంత రాష్ట్రాలకు వస్తున్నారు తెలుగువారు. ఇప్పటి వరకు ఇరాన్ నుంచి నలుగురు, ఇజ్రాయెల్ నుంచి ఇద్దరు విద్యార్థులు తిరిగివచ్చారు. ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న విద్యార్థులకు తోడుగా నిలబడి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు తెలంగాణ భవన్ అధికారులు. సోమవారం సాయంత్రం నాలుగున్నరకు 291 మందితో ఒక విమానం, రాత్రి పదకొండున్నరకు 165 మందితో ఒక విమానం ఢిల్లీకి చేరుకున్నాయి. ఇందులో వచ్చే మొత్తం 18 మంది తెలుగు విద్యార్థులను స్వస్థలాలకు పంపేందుకు ఢిల్లీలోని ఏపీ భవన్ ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉంటే బిహార్ శివాన్ జిల్లాకు ఓ కుర్రాడు ఇరాన్లో మిస్సయ్యాడు. ఇంజనీరింగ్ చదువుకున్న పాతికేళ్ల సిరాజ్ అలీ అన్సారీ ఒక పెట్రోలియం కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్గా చేరాడు. జూన్ 9న సౌదీ అరేబియా నుంచి ఇరాన్ చేరుకున్నాడు. జూన్ 17న మధ్యాహ్నం తర్వాత అతడితో కమ్యూనికేషన్ తెగిపోయింది. తమవాడి ఆచూకీ చెప్పాలంటూ భారత ప్రభుత్వానికి వేడుకుంటోంది అతడి కుటుంబం.

## ఫోన్ ట్యాపింగ్ గుట్టు విప్పేసారా...

**హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన మాజీ డీఎస్పీ ప్రణీత్రావు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుల వాంగ్మూలాలు దర్యాప్తును మరింత ఆసక్తికరంగా మార్చాయి. తాజాగా విచారణలో ప్రణీత్రావు అసలు గుట్టు విప్పారు.ప్రణీత్ రావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, 2018 నుంచే తెలంగాణలో రాజకీయ నాయకులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల ఫోన్లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు వెల్లడైంది. నాలుగేళ్ల కాలంలో వేల సంఖ్యలో ఫోన్లు ట్యాప్ చేయబడ్డాయి. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నిఘా కార్యకలాపాల తీవ్రతను సూచిస్తుంది. ఈ విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది, ఎందుకంటే ఇది గోప్యతా హక్కుల ఉల్లంఘనతో పాటు, రాజకీయ దురుద్దేశాలను సూచిస్తుంది.ప్రణీత్ రావు వెల్లడించిన మరో కీలక అంశం ఏమిటంటే, ట్యాప్ చేసిన ఫోన్ సంభాషణల డేటాను పెన్ డ్రైవ్లో కాపీ చేసి ప్రభాకర్ రావుకు అందించినట్లు తెలిపాడు. ఈ డేటా ఎవరికి చేరిందనే విషయంపై ప్రణీత్ రావు తనకు తెలియదని చెప్పడం దర్యాప్తులో కొత్త సందిగ్ధతను సృష్టించింది. ఈ పెన్ డ్రైవ్ ఎవరి చేతుల్లోకి వెళ్లింది, దాని ద్వారా ఎలాంటి సమాచారం ఉపయోగించబడింది అనే ప్రశ్నలు ఇప్పుడు సిట్ దర్యాప్తు దృష్టిలో కీలకంగా మారాయి.ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రణీత్ రావు మరియు ప్రభాకర్ రావులను విడివిగా విచారిస్తోంది. ప్రణీత్ రావు తన చర్యలన్నీ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగాయని చెబుతుండగా, ప్రభాకర్ రావు తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, అన్నీ అప్పటి డీజీపీ సూచనల మేరకే జరిగాయని వాదిస్తున్నాడు. ఈ విరుద్ధమైన వాంగ్మూలాలు దర్యాప్తును మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. సిట్ ఇప్పుడు ఈ డేటా బదిలీ గొలుసు ఎక్కడిదాకా వెళ్లిందనే దానిపై దృష్టి సారించింది.ఈ కేసు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చను రేపుతోంది. కొందరు రాజకీయ నాయకులు, ముఖ్యంగా బీజేపీ నేత బండి సంజయ్, ఈ ట్యాపింగ్ వ్యవహారం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు. అయితే, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఆరోపణలను రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తూ, దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ ఒత్తిళ్లు సిట్ దర్యాప్తును మరింత సవాలుగా మార్చాయి.సిట్ దర్యాప్తు ఇప్పుడు పెన్ డ్రైవ్ గమనాన్ని గుర్తించడంపై కేంద్రీకరించింది. ఈ డేటా ఎవరి చేతుల్లోకి వెళ్లింది, దానిని ఎలా ఉపయోగించారు అనే విషయాలు ఈ కేసు యొక్క తదుపరి దశను నిర్ణయిస్తాయి. అదనంగా, రివ్యూ కమిటీ నుంచి అనుమతులు ఎలా పొందారు, మావోయిస్టు ముసుగులో ఎలా ట్యాపింగ్ జరిగింది అనే అంశాలపై కూడా సిట్ ఆరా తీస్తోంది. ఈ కేసు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు లేదా రాజకీయ నాయకుల వరకు చేరే అవకాశం ఉంది, ఇది రాజకీయ రంగంలో మరింత గందరగోళాన్ని సృష్టించవచ్చు.

## నేరేడు పండు షుగర్ పేషెంట్స్‌కు ఆరోగ్య ప్రదాయని


**కరీంనగర్ :** చాలా కాలంగా కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవటానికి నేరేడు పండ్లను తినటం మంచిది. పేగుల్లో చుట్టుకు పోయిన వెంట్రుకలకు కోసేసి బయటికి పంపే శక్తి నేరేడు పళ్ళకు ఉంటుంది నేరేడు పండ్లు శరీరానికి చలవ చేస్తాయి. దీర్ఘకాల వ్యాదుల నివారణకు నేరేడు పండ్లను తినటం వలన రోగ నిరోదకశక్తి పెరుగుతుంది. వ్యాధి తీవ్రతను తగ్గిస్తుంది మూత్ర సంబంధ సమస్యల నుండి ఉపశమనాన్ని కలిగిస్తుంది. నీరసం, నిస్సత్తువ ఉన్న వారు నేరేడు పండును తింటే తక్షణ శక్తి వస్తుంది వెన్నునొప్పి, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పులు, నయం అవుతాయి. జిగట విరేచనాలతో బాధపడే వారికి నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున ఇవ్వాలి. రోగికి శక్తితోపాటు పేగుల కదలికలు నియంత్రణలో ఉంటాయి. కాలేయం పనితీరు క్రమబద్ధీకరించడానికి లేదా శుభ్రపరచడానికి నేరేడు దివ్యౌషధంలా పనిచేస్తుందని కొన్ని అధ్యయనాలు తేల్చాయి అని డాక్టర్ ఎండి. తిరుపతిరావు అన్నారు. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుకు, గుండెకు ఔషధంగా పనిచేస్తాయి. జ్వరంగా ఉన్నపుడు ధనియాల రసంలో నేరేడు రసం కలిపి తీసుకుంటే శరీర తాపం తగ్గుతుందిట. మూత్రం మంట తగ్గడానికి నిమ్మరసం, నేరేడు రసం రెండు చెంచాల చొప్పున నీళ్లలో కలిపి తీసుకోవాలి. పిండి పదార్థాలు, కొవ్వు భయం ఉండదు కనుక నేరేడు పండ్లను అధిక బరువు ఉన్నవారు. మధుమేహం రోగులు సైతం వీటిని రోజుకు ఆరు నుంచి ఎనిమిది దాకా తినవచ్చు.



# జస్ట్ ఎంజాయ్ బాస్.. కంగారు ఎందుకు అంటున్న ముద్దుగుమ్మ

ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండటం తప్పు లేదు గానీ.. ఆ గోలలో పడి పర్సనల్ లైఫ్ ఎంజాయ్ చేయడం మరిచిపోతుంటారు హీరోయిన్లు. అవకాశాలు వస్తున్నాయి కదా అని.. అస్సలు రెస్ట్ తీసుకోరు. కానీ తాను మాత్రం ఆ టైప్ కాదంటున్నారు జాన్వీ కపూర్. లండన్ వీధుల్లో ఈ భామ రచ్చకు సోషల్ మీడియా అంతా షేక్ అయిపోతుంది. చేసిందే ఒక్క సినిమా.. కానీ తెలుగులో కావాల్సినంత గుర్తింపు తెచ్చుకున్నారు జాన్వీ కపూర్. దేవర సినిమాలో తంగం పాత్రతో బాగానే చేరువయ్యారు ఈ బ్యూటీ. ప్రస్తుతం రామ్ చరణ్ పెద్ది సినిమాలో నటిస్తున్నారు. బాలీవుడ్ కంటే తెలుగులోనే ఈ భామకు మంచి ఆఫర్స్ వస్తున్నాయి. పెద్దితో టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ లిస్టులో చేరిపోవాలని చూస్తున్నారు జాన్వీ. పెద్ది సెట్స్‌పై ఉండగానే.. అల్లు అర్జున్, అట్లీ సినిమాలోనూ జాన్వీకి ఆఫర్ వచ్చినట్లు తెలుస్తుంది. ఇందులో మృణాళ్, దీపికతో కలిసి నటించబోతున్నారు జాన్వీ. మరోవైపు హిందీలోనూ బిజీగానే ఉన్నారు ఈ భామ. కెరీర్‌లో ఇంత బిజీగా ఉన్నా.. పర్సనల్ లైఫ్ మాత్రం మిస్ అవ్వరు ఈ బ్యూటీ. తాజాగా లండన్‌లో చెల్లి ఖుషీ, బాయ్ ఫ్రెండ్ శిఖర్ పహారియాతో కలిసి ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు జాన్వీ.కొన్నేళ్లుగా శిఖర్ పహారియాతో డేటింగ్ చేస్తున్నారు జాన్వీ. ఈ మధ్య ప్రియుడుతో కలిసి లండన్ వెళ్లారు జాన్వీ. ఈ ఇద్దరి ఫోటోలు వైరల్ అవుతున్నాయిప్పుడు. ఓవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరోవైపు పర్సనల్ లైఫ్‌కి ఇవ్వాల్సిన టైమ్ ఇస్తున్నారు జాన్వీ. ఈ బ్యాలెన్సింగ్ చాలా మంది హీరోయిన్లకు రాదు.. అందులో త్వరగానే ఆరితేరిపోయారు జాన్వీ కపూర్.

# విశ్వంభర పాటకు హీరోయిన్





విశ్వంభరలో బ్యాలన్స్ ఉన్న ఒకే ఒక్క ఐటెం సాంగ్ కు సమస్య తీరిందని లేటెస్ట్ అప్డేట్. ఏవేవో ఆప్షన్లు చూస్ చివరికి శాండల్ వుడ్ భామని లాక్ చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. తన పేరు నిష్విక నాయుడు. మనకు పరిచయం లేదు కానీ కన్నడ సినిమాలు ఫాలో అయ్యేవాళ్ళు గుర్తుపడతారు. బిచ్చగాడు శాండల్ వుడ్ రీమేక్ అమ్మ ఐ లవ్ యుతో 2018లో వచ్చిన నిష్విక ఇప్పటిదాకా తొమ్మిదికి పైగానే సినిమాలు చేసింది. గత ఏడాది శివరాజ్ కుమార్, ప్రభుదేవాల కరటక దమనకలో నటించింది. పుట్టి పెరిగింది, చదివింది అంతా బెంగళూరులోనే అయినా ఈ అమ్మాయి కుటుంబం మూలాలు తెలుగులోనే ఉన్నాయి. మరి పెద్దగా పాపులారిటీ లేని అమ్మాయిని ఎంచుకోవడం వెనుక దర్శకుడు వశిష్ఠ స్ట్రాటజీ ఏంటో అర్థం కావాలంటే సాంగ్ చూసే దాకా వెయిట్ చేయాలి. ఈ ఒక్క పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేస్తున్నాడు. ఇది కూడా అఫీషియల్ గా చెప్పలేదు. టీమ్ దాచిపెడితే లీకైపోయింది. అయినా సరే యువి క్రియేషన్స్ సమర్థిస్తూ, ఖండిస్తూ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికీ విపరీతమైన ఆలస్యానికి గురైన విశ్వంభర విడుదల వ్యవహారం త్వరలోనే కొలిక్కి రావోచ్చట. అమెజాన్ ప్రైమ్ కు ఓటిటి, జీ ఛానల్ కు శాటిలైట్ ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది ఇంకా ఖరారుగా తెలియాల్సి ఉంది. జూలై రాదనే క్లారిటీ వచ్చేయడంతో విశ్వంభరకున్న నెక్స్ట్ ఆప్షన్ ఆగస్ట్. మొదటి రెండు వారాల్లో కింగ్ డమ్, వార్ 2, కూలీ ఉన్నాయి. చివరి వారంలో రవితేజ మాస్ జాతర ఉంది. వీటితో మెగా మూవీ తలపడటం డౌటే. మిస్ అయితే మళ్ళీ సెప్టెంబర్ కు వెళ్లాల్సి ఉంటుంది.



# అనుష్క దర్శనం ఇంకెప్పుడు

ఇంకో ఇరవై రోజుల కంటే తక్కువ వ్యవధిలో ఘాటీ విడుదల కానుంది. జూలై 11 రిలీజ్ లో ఎలాంటి మార్పు లేదని యువి క్రియేషన్స్ స్పష్టం చేస్తున్న నేపథ్యంలో అభిమానులు అలెర్ట్ అయిపోయారు. అయితే ఇటీవలే విడుదల చేసిన మొదటి లిరికల్ సాంగ్ లో అనుష్కను చూపించి చూపించకుండా కేవలం రెండు షాట్లకు పరిమితం చేయడం పట్ల ఫ్యాన్స్ అసంతృప్తిగా ఫీలవుతున్నారు. విక్రమ్ ప్రభుతో తన పెళ్లి జరుగుతున్న పాటగా ప్రొజెక్ట్ చేయడం వరకు బాగానే ఉంది. కానీ కనీసం క్లోజ్ అప్ లో ఒక్క పిక్ చూపించకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అసలు ఎందుకిలా డిజైన్ చేశారనే అనుమానం కలుగుతోంది. టైం చాలా పరిమితంగా ఉండటంతో ఘాటీ ప్రమోషన్ల స్పీడ్ పెంచాలి. టైటిల్ రోల్ అనుష్కనే కాబట్టి మీడియా ముందుకు రావాల్సి ఉంటుంది. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి టైంలో ఏదోలా మేనేజ్ చేశారు కానీ ఈసారి అదే రిపీట్ చేస్తారా అనే డౌట్ లేకపోలేదు. ఆ సినిమా రిలీజ్ టైంలో వీడియో బైట్స్ తప్ప అనుష్క తానుగా ఇంటర్వ్యూలు ఇవ్వడం, ఈవెంట్ కు రావడం లాంటివి చేయలేదు. ఇప్పుడు ఘాటీ విషయంలో కూడా ఇలాగే చేస్తుందా అంటే ఏమో ఇప్పుడే చెప్పలేం. దర్శకుడు క్రిష్, డాన్స్ మాస్టర్ సుందరం మాస్టర్ కనిపించినంత సేపు కూడా పాటలో అనుష్కని చూపించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. సరే ఇదంతా ఎలా ఉన్నా ఘాటీకి ప్రస్తుతానికి పెద్ద బజ్ లేదు. దాన్ని పెంచాలి. ఇప్పటికే పలు వాయిదాల వల్ల హైప్ తగ్గింది. అప్పుడెప్పుడో చిన్న టీజర్ తో ఆసక్తి పెంచారు కానీ తర్వాత సైలెంట్ అయ్యారు. గంజాయి వ్యాపారంతో మాఫియా డాన్ గా మారిన ఒక మహిళ బయోపిక్ గా రూపొందిన ఘాటీలో యాక్షన్ ఎలిమెంట్స్ చాలానే ఉన్నాయట.



# కన్నప్ప సెన్సార్ పూర్తి.. రన్ టైమ్ కాస్తా ఎక్కువే!

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న కన్నప్ప రిలీజ్‌కు అంతా సిద్ధమైంది. ఈ నెల 27న థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే రిలీజైన పాటలు, ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ మూవీలో ప్రభాస్‌తో పాటు మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి సూపర్ స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. దీంతో ఈ సినిమాపై ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా కన్నప్ప మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ మూవీ రన్‌టైమ్ దాదాపు 182 నిమిషాలు కాగా.. అంటే మూడు గంటల రెండు నిమిషాలుగా ఉంది. మైథలాజికల్ నేపథ్యంలో వస్తోన్న మూవీ కావడంతో రన్‌టైమ్ కాస్తా ఎక్కువగానే ఉంది. 195 నిమిషాల నిడివితో ఈ సినిమాను తెరకెక్కించగా.. సెన్సార్ బోర్డ్ 12 కట్స్ చెప్పింది. సీబీఎఫ్‌సీ నిబంధనల ప్రకారం చిత్రం మార్పులకు అంగీకరించింది. రాబందు ఓ చిన్నారిని పై నుంచి పడేయటం.. తిన్నడుకు సంబంధించిన కొన్ని సీన్స్, మూడు పాటల్లోని విజువల్స్‌ను తొలగించారు. మరోవైపు కన్నప్ప అడ్వాన్స్ బుకింగ్స్ రేపటి నుంచి మొదలవుతాయని మంచు విష్ణు ట్వీట్ చేశారు. ఇప్పటికే ఓవర్‌సీస్‌లో బుకింగ్స్ ఓపెన్ కాగా.. తెలుగు అభిమానులకు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయని విష్ణు వెల్లడించారు. ఈ సినిమాకు ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. కృష్ణంరాజు నటించిన భక్త కన్నప్ప సినిమా తర్వాత దాదాపు 50 ఏళ్లకు మరోసారి కన్నప్ప కథ రావడంతో ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేసింది.

Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,